నేటి దినపత్రిక
# సూర్య
బుధవారం
6 డిసెంబరు
2023
పేజీలు 12
ప్రకాశం
బాపట్ల







# 'మిచౌంగ్' ముంచెన్!!





- ఈదురుగాలులతో కూడిన వర్షంతో అతలాకుతలం
- 'మిచౌంగ్' తుపానుతో జనజీవనం అస్తవ్యస్తం
- విరిగిపడిన చెట్లు, పొంగి పొర్లుతున్న వాగులు
- ఉమ్మడి జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు, 2 వేల కోట్ల మేర నష్టం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నేతలు, అధికారులు
- పునరావాస కేంద్రాలకు ముంపు ప్రాంత ప్రజల తరలింపు
- ప్రధాన రహదారులన్నీ జలమయం
- విద్యుత్తుకు అంతరాయం
- జల దిగ్బంధంలో శివారు, లోతట్టు ప్రాంతాలు



## పర్చూరు చరిత్రలో ఎన్నడూ లేని నష్టం

- గత రాత్రి నుంచి విద్యుత్‌కు అంతరాయం
- పనిచేయని సెల్‌ఫోన్లు.. దెబ్బతిన్న కమ్యూనికేషన్
- కరెంటు లేక మంచినీటి సదుపాయం కరవు
- పొంగుతున్న వాగులు, రాకపోకలకు అంతరాయం
- అందుబాటులో లేని నిత్యావసరాలు
- నీటి మునిగిన లక్షలాది ఎకరాల్లో పంటలు
- ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కాలనీలు జలమయం
- కనీస సదుపాయాలకు నోచుకోని ప్రజలు
- నీట మునిగిన పర్చూరు సబ్‌స్టేషన్
- పర్చూరు, కారంచేడులో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

పర్చూరు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాన్‌తో జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని, పర్చూరు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నష్టం వాటిల్లిందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు అన్నారు. మంగళవారం పర్చూరు కారంచేడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. తుఫాను ప్రభావంతో నీట మునిగిన మిరప పత్తి పొగాకు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజల జీవన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాగులపాలెంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. నాగులపాలెంలోని

మిగతా 3లో

## ప్రజలకు అండగా ప్రభుత్వం

- ఎవరూ అధైర్యపడొద్దు: మంత్రి ఆదిమూలపు సురేష్
- ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ: స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న
- పూర్తిస్థాయిలో సహాయక చర్యలు: కలెక్టర్ దినేష్‌కుమార్
- అందుబాటులో ప్రత్యేక బృందాలు: ఎస్పీ మలిక గర్గ్



ఒంగోలు, మేజర్‌న్యూస్: తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాల అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. ప్రభుత్వం తోడుగా ఉందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. తుపాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా దృష్టి పెట్టామన్నారు. జిల్లాపై తుఫాను ప్రభావం, యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై మంగళవారం కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. తుఫాను సహాయక చర్యల సమీక్ష, సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాకు నియమించిన స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి పి.ఎస్.ప్రద్యుమ్నతో కలిసి ఆయన ఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక మంగమూరు రోడ్డులోని సత్యసాయి స్కూల్లో ఏర్పాటు చేసిన

మిగతా 3లో





## అంతర్జాతీయ నైపుణ్య కేంద్రాల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

సూర్యప్రతినిధి, మేజర్‌న్యూస్



దేశ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటైన, నిర్మాణంలో నున్న అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వాటి ఆర్థిక, భౌతిక, క్రియాత్మక పురోగతి గురించి పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత సహాయక మంత్రి, రాజీవ్ చంద్రశేఖర్ సమాదానమిచ్చారు. ఉద్యోగాలు పొందుటలో ప్రపంచ స్థాయి ప్రతిభ డిమాండును అనుసరించి విదేశాలలో ఉపాధి అవకాశాలు కోరే భారత విద్యార్థులు ప్రపంచ ప్రమాణాలు అందుకొనుటకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ దేశంలో అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించినదని, వీటిలో వారికి అవసరమైన అన్ని వనరుల ఏర్పాటుతో శిక్షణ ఇవ్వడంతో పాటు సలహాలు, వీసా - పాస్ పోర్టులు పొందేందుకు సహాయం అందించనున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల స్థాపనకు నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రవాసి కౌశల్ వికాస్ యోజన పథకాలను అమలు చేస్తుందని, 2023-24 ఆర్థిక సంవత్సరానికి దేశంలో 30 నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. వీటి ఎంపిక వలస నమూనాల, ప్రాంతాల అవసరాలను బట్టి ఉంటుందని, ప్రస్తుతానికి అన్ని ప్రయోగశాలలతో, వసతులతో వారణాసిలో ఒకటి భువనేశ్వర్ లో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం 4,230 మంది అభ్యర్థులు శిక్షణ పొందుచున్నారని, ఈ శిక్షణతో వారు ప్రపంచ స్థాయి ప్రతిభపొంది విదేశాలలో ఉపాధి అవకాశాలను తప్పక పొందగలరని తెలియజేశారు.

# బాపట్ల ఎమ్మెల్యే కోన తుఫాన్ బాధితులకు సాయం



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: తన ఇంటినే కంట్రోల్ రూమ్ గా నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న కోన.సార్ నేను నర్రవారిపాలెం నుంచి వీరయ్యని మాట్లాడుతున్నాను మా ఊర్లో పూరి గుడిసెల్లో ఉన్నవారు బాగా ఇబ్బంది పడుతున్నారు. వీరయ్య నువ్వు లైన్లో ఉండు అని అప్పుడే పంచాయతీ కార్యదర్శి తో వెంటనే మాట్లాడి సమస్యకు పరిష్కారం చెప్పారు. సార్ నేను గోపాపురం నుంచి పొలాలు బాగా మునిగిపోయినవి జెసిబి కావాలి కాలువకు నీళ్లు తీస్తే వచ్చిన వర్షం నీరు కాలంలోకి పోతుంది. వెంటనే అక్కడ జెసిబి ని ఏర్పాటు చేయించి కాల్వ తవ్వించి దానిపై రైతులతో చర్చించారు. సార్ నేను చందోల నుంచి పాపం పూరిగుడిసెల్లోకి బాగా నీరు చేరి ఇబ్బంది పడుతున్నారు సార్. అయితే వెంటనే వారిని పునరావాస కేంద్రానికి తరలించి అక్కడ ఆహారం అది ఏర్పాటు చేశారు దగ్గరుండి మీరే వారిని తరలించండి. ఇంకా ఏమైనా అవసరం అయితే ఫోన్ చేయండి. ఇది గత 24 గంటల నుంచి బాపట్ల శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి ప్రజలకు అందుబాటులో ఉంటున్న విధానం. ఎవరు ఫోన్ చేసినా వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. అంతేకాకుండా అక్కడ ఉన్న నాయకులను అధికారులను వెంటనే ఈ సమస్యను తెలియజేసి దాని పరిష్కారం మార్గం ఏర్పాటు చేస్తున్నారు. తన ఇంటిని కంట్రోల్ రూమ్ గా ఏర్పాటు చేసుకుని ప్రజల కోసం నియోజకవర్గ ప్రజల సమస్యల కోసం ఆయన అందుబాటులో ఉంటున్నారు. ఇలాంటి విషయాల ఆయనకి కొత్తేమీ కాదు. కరోనా సమయంలో కూడా ఇదే విధంగా ఆయన ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు, హాస్పిటల్లో బెడ్ అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూడా ఈ విపత్తుని ఎదుర్కోవటానికి ఆయన శాయశక్తుల కృషి చేస్తూ ప్రతి ఫోన్ అటెండ్ చేస్తూ అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నారు.

## రైతులను వెంటనే ఆదుకోవాలి: కళ్ళం హరినాథ రెడ్డి



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో భారీ వర్షాలు కారణం గా పంట నష్టపడిన రైతులకు అత్యవసర పరిస్థితి గా పరిగణించి పూర్తి నష్టాన్ని చెల్లించి ఆదుకోవాలని నరసాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పూర్వ అధ్యక్షుడు కళ్ళం హరినాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మెట్ట భూమి సాగు కొద్ది ప్రాంతాలు మినహా అనేక మంది రైతులు నష్టాల ఊబిలో ఉన్నారు.మాగాణి భూములలో 4 సంవత్సరాలుగా వరి పంట సాగుదారులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.ప్రస్తుతం వడ్లు మంచి ధర ఉన్నప్పటికీ రైతుల వద్ద ధాన్యం నిల్వ లేదు.నిన్నటి వరకు సాగు నీరు లేక కష్టాలు పడిన రైతులు ఈరోజు అకాల వర్షాల కారణంగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అనావృష్టి - అతివృష్టి అనే అడకత్తెరలో పోక చెక్కలా రైతు పరిస్థితి నేడు వున్నది.ఈ పరిస్థితుల్లో రైతులకు అర కొర సహాయం కాకుండా సంపూర్ణ నష్ట పరిహారం చెల్లించాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రార్థిస్తున్నాను. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008 వ సంవత్సరంలో కృష్ణా డెల్టా ఆధునీకరణకు 4570 కోట్ల రూపాయల ప్రణాళిక తో ప్రారంభించిన పనులు ఇంతవరకు పూర్తి కానందున రైతులు సాగు నీరు మరియు మురుగు నీరు పారుదలకు అనేక ఇబ్బందులకు గురవుతు న్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇన్పుట్ సబ్సిడీ తో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్ట పరిహారం కోసం ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు అత్యవసరం.ప్రస్తుతం ఉన్న పంటల భీమా పథకం రైతులకు ప్రయజనం కలిగే విధంగా అనేక మార్పులు చేర్పులు చేయవలసిన అవసరం ఉంది. దేశానికి వెన్నుము క అయిన వ్యవసాయ రంగం రైతుల కు లాభదాయకం గా లేని పక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటు పడుతుంది.కావున ప్రభుత్వాలు రైతుల సమస్యలను అత్యవసర సమస్య గా పరిగణించి పరిష్కరించాలి.

## తుఫాను సహాయక చర్యల్లో బాపట్ల ఎమ్మెల్యే కోనా టీం





బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్లలో గడిచిన రెండు రోజుల నుంచి తుఫాను వలన కురుస్తున్న భారీ వర్షాలకు వైసీపీ పార్టీ శ్రేణులు సహాయక చర్యలు నిమగ్నమయ్యారు. బాపట్ల శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదేశాలతో నియోజకవర్గం ప్రతి నాయకుడు వారి గ్రామాల పరిధిలో ఉన్న పునరావాస కేంద్రాలు, పూరి గుడిసెల్లో ఉన్నవారిని సందర్శించి తక్షణమే వారికి కావలసిన సహాయక చర్యలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ వైసీపీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అంతే కాకుండా బాపట్ల శాసనసభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదేశాలతో ప్రతి నాయకుడు సహాయక చర్యలు పాలుపంచుకుంటున్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో ఆహారము, తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ సహాయం కావాలన్నా వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. తుఫాను పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి పార్టీ నాయకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో వెంటనే వారు ఆదేశాలతో వారి వారి గ్రామాల పరిధిలో తక్షణ సహాయక చర్యలు చేపడుతూ ఇటు అధికారులను అటు ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

## 6వ తేదీన పాఠశాలలకు సెలవు ప్రకటించాలి: ఎఫ్ ఏ పి టి ఓ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా సూర్యలంకలో మిచుంగ్ తుఫాను తీరం దాటింది. ఈరోజు, రేపు 6/12/2023న భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయి అని, ఈదురు గాలులు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో 6వ తేదీ బుధవారం కూడా బాపట్ల జిల్లా లోని అన్ని యజమాన్య పాఠశాలకు సెలవు దినంగా ప్రకటించమని జిల్లా విద్యా శాఖ అధికారి పి వి జె రామారావు ని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఎఫ్ ఏ పి టి ఓ తరుపున కోరారు చైర్మన్ బి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ సిహెచ్ టీవీ సురేష్. ఈ క్రమంలో సిహెచ్ టీవీ సురేష్ మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలు వర్షపు నీటితో నిండిపోగా, కొన్ని తరగతి గదులు నీళ్లతో, బురదతో నిండిపోయాయి.విద్యార్థులను పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగి పడిపోయాయి. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బాపట్ల జిల్లా లో గత 4 రోజులుగా రెడ్ అలెర్ట్ ప్రటించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,టీచర్లు భారీ వర్షాలు కారణంగా రేపు 6/12/2023న కూడా బాపట్ల జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించవలసినదిగా కోరారు మరియు కొన్ని స్కూల్స్ లో తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందువల్ల డి ఈ ఓ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి 6/12/2023న సెలవు దినము ప్రకటించాలని విన్నవించుకున్నారు.

### పునరావాసం, ఆహారం అందజేసిన వలి

కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం లోని పాతానందాయపాలెం పంచాయతీ బాపట్ల రోడ్డు జాతీయ రహదారి పక్కన గుడిసెలలో ఉంటున్న 10 కుటుంబాల వారికి హైదరాబాద్ వలి పునరావాసం కల్పించి ,ఆహారం అందించారు. ఈసందర్భంగా వలి మాట్లాడుతూ వర్షాలు తగ్గేదాక షెల్టర్ కల్పించి ఆహారం అందిస్తానని వలి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.



### పునరావాస కేంద్రాలకు ప్రజలు రావాలి



రేపల్లె, మేజర్‌న్యూస్: మిచాంగ్ తుఫాను తీరప్రాంతంలో తీవ్ర ప్రభావం చూపనున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ డివిజనల్ అధికారి, హేల షారోన్ హెచ్చరించారు. ఈ మేరకు డివిజన్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో నికి రావాలని కోరారు. పశువుల రక్షణ కొరకు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహాయక బృందాలను సంప్రదించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు గ్రామంలో ప్రభుత్వం నియమించిన తుఫాను రక్షణ సిబ్బందిని సంప్రదించి సహాయం పొందాలన్నారు. మిచాంగ్ తుఫాను కారణంగా రెవిన్యూ డివిజనల్ అధికారి, రేపల్లె కార్యాలయం నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ నెం.8008293401. కావున సహాయం కావలసిన వారు సదరు కంట్రోల్ రూమ్ ను సద్వినియోగం చేసుకోవలని కోరారు.

### ప్రజలతో ఫోన్లో మాట్లాడిన నారా చంద్రబాబు నాయుడు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూాన్: మీచౌంగ్ తుఫ్ఫాన్ ప్రభావం వలన నీటమునిగిన బాపట్ల పట్టణంలోని 3 వార్డు లోతట్టు ప్రాంతంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నరేంద్ర వర్మ పర్యటించి నియోజ కవర్గంలోని ప్రస్తుత పరిస్థితులను ఆయన జాతీయ తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు కి ఫోన్లో వివరించారు,అలాగే ఇక్కడ ప్రజలకు వారితో ఫోన్లో మాట్లాడించి ప్రజలకు ధైర్యం చేకూర్చారు. చంద్రబాబు ఇక్కడ ప్రజలకు ధైర్యం చెప్తూ ఎవరు ధైర్యం కోల్పోవద్దని ధైర్యంగా ఉం డాలని అన్నారు, నరేంద్ర వర్మ మీకు తోడుగా అండగా ఉంటారు అని అన్నారు. సహాయక చర్యల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కూడా పాల్గొనా లని ఈ సందర్భంగా చంద్ర బాబు నాయుడు పిలుపునిచ్చారు.

### భారీ వర్షాలకు జలమయ మైన కాలనీలు



వేమూరు(భట్టిప్రోలు), మేజర్‌న్యూస్: బంగాళాఖాతంలో ఏర్పడిన మీచౌంగ్ తుఫాన్ కారణంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల గ్రామాల్లోని పలు కాలనీలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో కూడా వర్షపు నీరు చేరి ఇండ్ల గోడలు కూడా కూలిపోయాయి. వేమూరులోని అంబేద్కర్ నగర్ లో జంగాల కాలనీలో వర్షం నీరు చేయడం బాధిత కుటుంబాలను కమ్యూనిటీ హాలు లలోనికి చేర్చారు.బాధిత కుటుంబాలను మంత్రి మేరుగ నాగార్జున పరామర్శించి ధైర్యం చెప్పారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.అక్కడ ఉన్న తహసీల్దారును పిలిచి తక్షణ సహాయంగా ఒక్కొక్క కుటుంబానికి 5 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా నీరు నిలిచిన గృహాలను గుర్తించి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దారు నాగరాజు ఆదేశించారు. ఆయనతోపాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ని ఎస్టీ కాలనీ వాసులకు నల్లమోతు వారి పాలెం గ్రామ సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం కూరగాయలు, బియ్యం పంపిణీ చేశారు. తుఫాను కారణంగా ఇబ్బందులు పడుతున్న ఎస్టీ కాలనీ వాసులకు వీటిని అందజేసి అదేవిధంగా కర్లపాలెం ,నల్లమోతు వారి పాలెం ,చందోలు గ్రామాల్లోని పేద కుటుంబాల వారికి తన వంతు సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతాయపాలెం గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దొప్పలపూడి వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు.

### పునరావాస కేంద్రాలకు తరలింపు



రేపల్లె, మేజర్‌న్యూస్:మిఛాన్ తుఫాన్ వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదని మండల పరిధిలోని గుడికాయలంక పంచాయతీలో ముంపు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావస కేంద్రాలకు తరలిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కే శివ పార్వతి గ్రామ సర్పంచ్ వై శ్రీనివాసరావు లు మంగళవారం ప్రతి గృహాన్ని సందర్శించి వారి సురక్షిత ప్రాంతాలకు తరలించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలోనూ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ల ద్వారా ప్రతి ఒక్కరిని ముం దస్తు చర్యలో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కావలసిన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆమె తెలిపారు.





# ప్రజలకు అండగా ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి** తుఫాను పునరావాస కేంద్రాన్ని వీరు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలపై మంత్రి, ప్రద్యుమ్న ఆరా తీశారు.

మంత్రి సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, ఆర్.డబ్ల్యు.ఎస్., ఆర్ అండ్ బి., పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, సివిల్ సప్లయ్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులందరికీ సంతృప్తికర సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. తుఫాను ప్రభావం తగ్గిన తరువాత పంట నష్టం అంచనా వేస్తామన్నారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఏ సీజన్లో నష్ట పోయిన పంటకు అదే సీజన్లో లో పరిహారాన్ని ముఖ్యమంత్రి అందిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

స్పెషల్ ఆఫీసర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితులను బట్టి అవసరమైన చర్యలను యంత్రాంగం చేపట్టిందన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి నుంచి వివరాలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు ముందుగానే తరలించిందన్నారు. అధికార యంత్రాంగానికి ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన సూచించారు.

కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సెలవులను రద్దు చేసి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహాయ, పునరావాస చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. తీరప్రాంత మండలాలతో పాటు సరిహద్దు మండలాల ప్రజలను కూడా అప్రమత్తం చేశామన్నారు. పూరిళ్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని, ఈ శిబిరాలలో భోజనం, మంచి నీటి సౌకర్యాలతోపాటు అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి శిబిరానికి డిప్యూటీ తహశీల్దార్, ఈ.ఓ.పి.ఆర్.డి. స్థాయి అధికారులను ఇన్చార్జీలుగా నియమించామన్నారు. మండల మరియు నియోజ కవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను నియమించి సహాయ, పునరావాస కార్యక్రమాలను జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. 24 గంటలూ పనిచేసేలా కలెక్టరేట్ తోపాటు ఎస్పీ ఆఫీస్ లోనూ కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు.

ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోడ్ల పై చెట్లు కూలిపోతే క్లియర్ చేయడానికి అవసరమైన పరికరాలతో పోలీసు, మెరైన్, ఆర్ అండ్ బి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచామన్నారు. తీరప్రాంతం, వాగులు వంకల వద్ద ప్రత్యేక పికెట్స్, బందోస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం కొత్తపట్నంలోని పల్లెపాలెం సచివాల యం, రైతుభరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రద్యుమ్న, కలెక్టర్, ఎస్.పి. పరిశీలించారు. శిబిరాలలో ఉంటున్న వారితో మాట్లాడి సమయానికి ఆహారం, ఇతర వసతులపై ఆరా తీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సముద్ర తీరప్రాంతాన్ని కూడా వారు పరిశీలించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున తీరప్రాంతానికి రావద్దని ప్రజలకు వారు సూచించారు. అధికార యంత్రాంగానికి సహకరించాల ని, ప్రభుత్వం చేసిన సూచనలు పాటించాలని వారు చెప్పారు. ఈ పర్యటనలో వీరి వెంట ఆర్.డి.ఓ. విశ్వేశ్వరరావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# పర్చూరు చరిత్రలో ఎన్నడూ లేని నష్టం

**మొదటి పేజీ తరువాయి** ముస్లింకాలనీ, ఎన్టీఆర్ కాలనీ, నాగుల పాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రభుత్వం ముందు చూపు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత రాత్రి నుంచి విద్యుత్ సదుపాయం లేక సెల్ ఫోన్లు పని చేయక, కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. విద్యుత్ లేక మంచినీటి వాటర్ ప్లాంట్ లో పనిచేయక సురక్షిత నీరు అందక ప్రజలంతా తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ముందు చూపు లేకపోవడం వల్ల ప్రజలు నిత్యవసర వస్తువులకు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వాగులు వంకలు పొంగిపొర్లుతున్న రెవెన్యూ యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పునరావాస కేంద్రాలలో సరైన వసతులు కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజల ఇబ్బందులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ను పునరుద్ధరించి మంచినీటి సమస్యను పరిష్క రించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలో ముంపుకు గుర య్యాయని సానిటేషన్ సమస్యను తక్షణమే పరి ష్కరించాలన్నారు. మురుగునీటిని తరలించేలా చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా నిత్యవసర వస్తువులు, మంచినీరు అందించి విద్యుత్‌ను పునరుద్ధరించాలన్నారు.




## తుఫాన్ బాధితులకు దుప్పట్లో పంపిణీ చేసిన టీడీపీ



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: మిచాంగు తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు పునరావస కేంద్రాలకు తరలించారు. పునరావస బాధితులకు రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం చెరుకుపల్లి హైస్కూల్లో తుఫాన్ ప్రభావిత బాధితులను మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించి దుప్పట్లు పంపిణీ చేసి వారికి సదుపాయాలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, టౌన్ టిడిపి అధ్యక్షులు నాగులు పున్నారావు, టిడిపి సీనియర్ నాయకులు ఎం ఆర్ కే మూర్తి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు, బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి వి శ్రీనివాసరావు, సొంటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షం సైతం లెక్కచేయని విద్యుత్ సిబ్బంది



రేపల్లె, మేజర్‌న్యూస్: గత రెండు రోజులుగా ఏడ తెరపకుండా కురుస్తున్న వర్షం విపరీతమైన గాలులతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి దీంతో ప్రజలు అంధకారంలోకి వెళ్లి ఇబ్బందులకు గురవుతారని గ్రామాల్లో పట్టణాల్లో విద్యుత్ వెలుతురుతో అందరూ బాగుండాలని దృఢ సంకల్పంతో విద్యుత్ శాఖ అధికారులు వర్షం గాలిని సైతం లెక్కచేయకుండా తెగిపోయిన వైర్లను సరిచేసి పట్టణాల్లో గ్రామాల్లో విద్యుత్ ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నారు అందులో భాగంగానే పట్టణ పరిధిలో గల 15వ వార్డులో విద్యుత్ వైర్లు తెగి పడటంతో పట్టణం మొత్తం అంధకారమయం అయింది దీనిని గమనించిన అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా చేసేందుకు సిబ్బందిని కేటాయించి వైర్లను సరిచేసి విద్యుత్తును అందజేశారు.

## వర్షం సైతం లెక్కచేయని ప్రజా సేవకులు



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: తుఫాను ప్రభావంతో నిజాంపట్నం గ్రామంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని గమనించిన జిల్లా పరిషత్ సభ్యులు నర్రా సుబ్బయ్య మండల పరిషత్ అధ్యక్షులు మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబులు మంగళవారం జోరు వానను కూడా లెక్కచేయకుండా గ్రామంలో పర్యటించి ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకుండా జెసిబి ల ద్వారా నీటిని పోయే మార్గాలను చేసి కాలువల ద్వారా నీటిని తరలించారు. అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో నిజాంపట్నం లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయోయని ముందుగా గ్రహించిన నాయకులు ముందస్తుగానే స్థానిక నాయకులకు సమాచారం అందించి అక్కడికి చేరుకుని ఏమి నష్టం కాకుండా నీటిని తరలించి అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి కావలసిన సౌకర్యాలను కల్పించడంలో నాయకులకు కృషిని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# నష్టపరిహారంగా జిల్లాకు రూ. 20 కోట్లు ఇవ్వాలి



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: మిగ్ జాం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం బాపట్ల జిల్లాకు కనీసం రూ.20 కోట్ల చొప్పున కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఒక్కో జిల్లాకు కేటాయించిన రూ.2 కోట్లు ఏమాత్రం సరిపోవన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తీవ్ర తుఫాను రైతులను వణికిస్తోందని వాపోయారు.మిగ్ జాం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఒక్కో జిల్లాకు కనీసం రూ.10 కోట్ల చొప్పున కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మీ చౌంగ్ తీరం దాటే సమయంలో బీభత్సం సృష్టించే పరిస్థితి నెలకొంటుందని అధికారుల చేస్తున్న ప్రకటనలకు తగినట్లు ప్రభుత్వం సాయం చేయాలన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఇళ్లు కూలి, చెట్లు నేలకు ఒరిగి, నీట మునిగిన నివాస గృహాలు, జలమయమయిన పంట పొలాలను దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లాకు రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరుగాల శ్రమించిన రైతు తుఫాను ప్రభావం నీట మునిగిన పంటలను చూసి రోదిస్తున్న తీరు వర్ణనాతీతం అన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో పూర్తిగా దెబ్బతిన్న కౌలు రైతులు, రైతులకు నష్టపరిహారం ఇచ్చి వారిని ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లాలోని తీరం దాటుతున్న నేపథ్యంలో వర్ష ప్రభావం, గాలుల తీవ్రత భారీగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాలు, పట్టణ వార్డుల పరిధిలో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగి ప్రజల జీవన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. చేతి వృత్తిదారులుగా ఉండే బీసీలు కూలి చేసుకుంటే గాని జీవనం గడపలేని పరిస్థితిలో గత రెండు రోజుల నుంచి ఇంటికే పరిమితం కావడంతో వారి కుటుంబ పోషణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. వెంటనే అధికారులు స్పందించి సహాయక చర్యలో భాగంగా బడుగు, బలహీన, దళిత, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన వారికి ప్రతి ఇంటికి 25 కేజీలు బియ్యం, నిత్యవసర సరుకులను వెంటనే అందించాలని కోరారు. సహాయ చర్యల్లో ప్రభుత్వ అధికారులు చురుకుగా పాల్గొనేందుకు అన్ని ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# ముంపుకు గురైన పంటపొలాలు పరిశీలించిన టీడీపీ బృందం



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: మిఛాన్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నిజాంపట్నం మండలం దిండి పంచాయితీ లో పాడైపోయిన వేరుసెనగ పంట పొలాలను మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం తక్షణమే అందించి వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టం అంచనా పేరుతో కాలయాపన చేయకుండా వర్షం తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు , తాతా ఏడుకొండలు, దండుప్రోలు వెంకటేశ్వ రరావు (డివిఆర్) , కోపనాతి రాజశేఖర్, కేసన రామకృష్ణ , యరగళ్ల శ్రీనివాసరావు, దండుప్రోలు పిచ్చయ్య , తధితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు రూ 20వేలు నష్టపరిహారం అందించాలి

**-సీపీఐ నాయకుల డిమాండ్**



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెనుగాలులనుకు రేపల్లె, వేమూరు నియోజ కవర్గాల్లోని పంటలను నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భట్టిప్రోలులో వర్షాలకు నేల వాలిన వరి పంటను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా బాలాజీ, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఆరుగాలం చెమట చుక్కలు చెందించి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట మరి కొద్ది రోజుల్లో చేతికి వస్తుంది తమ కష్టాలు గట్టెకుతాయని ఎంతో ఆశతో ఉన్న అన్నదాతను తుఫాను కోలుకోలేని దెబ్బతీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే వరి పంట సాగు కోసం ఎకరాకు రూ 25 వేల నుంచి రూ 30 వేల వరకు పెట్టిన పెట్టుబడును వర్షం పాలయ్యాయని అన్నదాత కుమిలిపో తున్నాడని వారు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంట నష్టాలపై అంచనాలను రూపొందించి య కరా వరి పంటకు రూ 20 వేలు నష్ట పరిహారం అందించాలని బాలాజీ, శ్రీనివా సరావులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయ కులు దాసరి నాంచారయ్య,వి. శ్రీనివా సరావు,రైతు ఎస్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట పొలాల ను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ



కొల్లూరు, మేజర్‌న్యూస్: మండల పరిధి లోని క్రాప రోడ్డు వద్ద మంగళవారం మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నీటిలో మునిగిన వరిపొలాల్ని పరిశీలించారు ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడుతూఅన్ని విధాలుగా ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీ వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి తో మాట్లాడి ఆదు కుంటామని అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు ఆయన వెంట వైస్ ఎంపీపీ మురాల రాంబాబు , కూచిపూడి మోష, ఐల సుబ్బారావు, వైసిపి నాయకులు కమ్మెల సాంబశివ రావు వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లెముంత ఏడుకొండలు, కొల్లూరు మండల వైసిపి కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, ఆళ్ళమూడి మధు, వైసిపి నాయకులు, రైతులు ఉన్నారు.

# రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి



రేపల్లె, మేజర్‌న్యూస్:రైతులందరూ వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలను పాటించి పంట నష్ట నివారణను తగ్గించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని తుఫాను కారణంగా నేలకొరిగిన పంటలను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడుతూ రైతులందరూ పొలంలో నీరు నిలబడకుండా కాలువల ద్వారా బయటకు పంపే విధంగా ఏర్పాటు చేసుకోవాలని అలాగే వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత గింజలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం (పది కేజీల ఉప్పు ఎకరా పొలానికి) పిచికారి చేయాలని తెలియజేశారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాలలో మిఛాన్ తుఫాను ప్రభావం ప్రభావం వల్ల గత మూడు మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల సరాసరి వర్షపాతం 131.2 ఎం. ఎం. గా డిసెంబర్ 5వ తేదీ నాటికి నమోదు అయిందని వర్షముతో కూడిన ఈదురు గాలుల వలన దాదాపు రేపల్లె సబ్ డివిజన్లో 80 వేల ఎకరాలలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేల వాలింది అని ఏ.డి.ఏ తెలిపారు.రేపల్లె సబ్ డివిజన్లోని ఏడు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయ అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రాథమిక క్షేత్ర పరిశీలన చేసి పంట నష్ట అంచనాలను చేస్తున్నట్లు తెలియ జేశారు.తుఫాను తగ్గుముఖం పడనందున డిసెంబర్ 6 వ తారీకు వరకు ఇంకా వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున పంట నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని ఎవరు అధైర్య పడొద్దని ఏ.డి.ఏ. తెలిపారు.

### టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల సమక్షంలో

## గిద్దలూరు జడ్పీటీసీ జన్మదిన వేడుకలు



ప్రకాశం జిల్లా, గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు జడ్పిటిసి సభ్యుడు బుడతా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి గారు కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంగం వారి నూతన గృహప్రవేశంలో .....

పట్టణం, కొంగలవీడు: రోడ్డులోని నూతన అపార్ట్మెంట్ లో అంగం శ్రీనివాసులు గారి నూతన గృహ ప్రవేశం సందర్భంగా గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్య అతిధిగా పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేశారు.. ఈ కార్యక్రమంలో వారితో పాటు పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో...

ప్రకాశం జిల్లా, గిద్దలూరు: పట్టణం, 7వ వార్డులోని మూడు కుళాయిల రోడ్డులో అంబవరపు కృష్ణారెడ్డి గారి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్య అతిధిగా పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేశారు.. ఈ కార్యక్రమంలో వారితో పాటు పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.లి

## రాచర్ల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ముత్తుముల



ప్రకాశం జిల్లా, రాచర్ల: పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి గారు పరమశివుడిని దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్ మరియు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.లి

### వలీమా కార్యక్రమంలో...



ప్రకాశం జిల్లా, కొమరోలు: మండలం, రాజుపాలెం గ్రామంలో షేక్ ఖాసుమియా కుమారుడు "చి. ఖాసీం ఉమర్" నిఖా అనంతరం ఏర్పాటు చెందిన వలీమా కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేశారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోడి ఓబుల్ రెడ్డి, నంది శ్రీను, గంటా కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది: మంత్రి మేరుగ



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: బంగాళాఖాతంలో ఏర్పడిన మీచౌంగ్ తుఫాను కారణం గా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదు కుంటుందని రాష్ట్ర సాం ఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ మెరుగ నాగర్జున అన్నారు. మంగళవారం మండలంలోని వెల్లటూరు భట్టిప్రోలు అద్దేపల్లి తదితర గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని నాగార్జున తెలియజేశారు. ఆరుగాలం రైతులు చమటోర్చి పండించిన పంటలు తుఫాను కారణంగా దెబ్బతి నటం బాధాకరమన్నారు, ప్రకృతి వైపరీ త్యాల వల్ల కలిగే నష్టాన్ని పూడ్చలే మని,పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంద న్నారు.ఇప్ప టికే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తుఫాన్ నష్టాన్ని ని వారించేందుకు తగిన చర్యలు తీసు కుంటున్నారని అం దులో భాగంగానే పంట నష్టపోయిన పొలాలను ఎన్యుమరేషన్ చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.అదేవిధంగా కృష్ణా నది పరివాహక లంక గ్రామాలలో సాగు చేసిన కంద అరటికి నష్టం వాటిల్ల వచ్చునున్నారు. పంటల నష్టం అంచనాలను తయారు చేయవలసి ందిగా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు గ్రామ సర్పంచ్ ధారా రవి కిరణ్మయిచన్నయ్య, వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు, తహసి ల్దారు ధూళిపూడి వెంకటేశ్వర రావు, ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర్,వ్య వసా యశాఖ అధికారి జి మీరయ్య, పలు వురు వైసిపి నాయకులు,తదితరఅధికారులున్నారు.

## రోడ్డు పై వారిన కంపను తొలగించిన : ఈఓఆర్డి ప్రసాద్



కురిచేడు, మేజర్‌న్యూస్: కురిచేడు నుండి దొనకొండ గ్రామం వైపు వెళ్లే రహదారి శిద్దా రాఘవరావు కాలనీ స్థలాల సమీపంలో చిల్లకంప రహదారిపై వాడడంతో రాకపోకలకు అంతరాయం కలగడం, అక్కడ టర్నింగ్ పాయింట్ కావటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కురిచేడు ఈఓర్డి ప్రసాద్ జోరుని కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా దగ్గరుండి రోడ్డు పైకి ఒంగిపోయిన చిల్లకంపను తొలగించారు. అలాగే మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులను ఇబ్బంది కలిగిస్తున్న ఎస్ఎస్పి కాలనీ సమీపంలో ఉన్న మురుగు కాలువలను డోజర్ సహాయంతో శుభ్రం చేసి మురికి నీరు యధాతధంగా పారేటట్టు చేశారు. ఈ మురికి నీరు నిల్వ ఉండటం వల్ల సమీప బీసీ హాస్టల్ ప్రాంగణంలో కి ప్రవేశించి, మురికి నీరు నిల్వ ఉన్నవి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆ మురికి నీటి వల్ల రోగాలు విద్యార్థులకు ప్రభువే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కురిచేడు ఈఓర్డి ప్రసాద్ జోరున కురుస్తున్న తుఫాన్ లెక్కచేయకుండా దగ్గరుండి మురికి కాలువలను శుభ్రం చేసి మురికి నీరు ఎక్కడ నిల్వ ఉండకుం డా చేశారు. అధికారులు ఈ విధంగా నిర్లక్ష్యం చేయకుండా ప్రజా శ్రేయస్సు నీ దృష్టిలో పెట్టుకొని తమ విధి నిర్వహణ చేస్తుంటే ప్రజల్లో గౌరవం పెరిగి వారికి సముచిత స్థానం సమాజంలో ఉంటుంది. ఇఓర్డి చేసిన ఈ పని వల్ల అటు విద్యార్థి తల్లిదండ్రులు ఇటు ప్రజలు అతన్ని ప్రశంసల జల్లులతో ముంచేశారు. ఈ కార్యక్రమంలో ఇతను తో పాటు సచివాలయం కురిచేడు సచివాలయం-2 కార్యదర్శి జి కోటేశ్వరరావు, పరమర పాలెం వీరాయపాలెం కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, నాయుడుపాలెం కార్యదర్శి భాష, పంచాయత సిబ్బంది పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ అధికారులు



జరుగుమల్లి మేజర్‌న్యూస్: మించి గే తుఫాన్ ప్రభావం వల్ల రైతుల సాగు చేసిన మినుము కంది మిరప సాగు చేసిన పొలాల్లో వర్షపు నీరు ఆరడుగుల రోడ్డును వచ్చినాయని వర్షం వల్ల రైతుల సాగు చేసిన పంటలు దెబ్బతిన్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి డి యుగంధర్ రెడ్డి తెలిపారు మంగళవారం మండల పరిధిలోని ఎడ్లూరుపాడు గ్రామంలో మిరప కంది మినుము పంటను పరిశీలించారు రైతులు నష్టపోయినట్టు అంచన వేసినట్టు ఆయన సందర్భంగా తెలిపారు అయితే ఈ మండలంలో ఇప్పుడు వరకు 36 33% ఎకరాలు రైతులు వివిధ పంటలో సాగు చేసినట్టు ఆయన తెలిపారు అయితే వరి పంట మాత్రం ఎటువంటి నష్టపరిహారం జరగలేదని మిగిలిన మిరప మినుము కంది పంటకు నష్టం వాటిని అంచనా విలువ తయారుచేసి నివేదికను జిల్లా కార్యాలయం పంపిస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి డి యుగంధర్ రెడ్డి తెలిపారు.

## బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: జనసేన పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని గుళ్ళపల్లి గ్రామంలో గల బూర్లమ్మ డొంక రోడ్డులో మిచాంగ్ తుపాన్ బాధితులను మండల జనసేన పార్టీ నాయకులు మంగళవారం కలిసి పరామర్శించి వారికి ఆహార పట్లాలను, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ చెరుకుపల్లి మండలం అధ్యక్షుడు ధూళ్ళ సురేష్, ఉపాధ్యక్షుడు మొఖమాటం ప్రుధ్వీ, గులకారం పవన్, ఛల్లా యేసు పాదం, లక్కింశెట్టి గోపికృష్ణ లు వారితో కలిసి అక్కడే భోజనం చేశారు. మీకు ఎటువంటి కష్టం వచ్చినా జనసేన పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు.

## నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల**

ప్రకాశం జిల్లా, గిద్దలూరు, మేజర్‌న్యూస్:రాష్ట్ర వ్యాప్తంగా మిచౌంగ్ తుఫాన్ కారణంగా గిద్దలూరు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ ఇంచార్జ్, ముత్తుముల అశోక్ రెడ్డి గారు సూచించారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, విద్యుత్ స్తంభాల వద్దకు చిన్నపిల్లలు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అదే విధంగా రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని పంటలు నష్ట పోకుండా వారికీ తగిన సహకారం అందించాలన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.







**దామచర్ల జనార్ధన్ ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలోని శివారు కాలనీల్లో నిరుపేదలకు భోజనం పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు, మహిళలు**

**- ఒంగోలు, మేజర్‌న్యూస్**

# పునరావాసకేంద్రాలు, లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన నాగేశ్వరరావు

## సహాయం కోసం అందుబాటులో ఉంటాము





కందుకూరు, మేజర్‌న్యూస్: తుఫాను నేపథ్యంలో వివిధ ప్రాతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పర్యటించారు. కందుకూరు పట్టణంలోని జనార్ధనకాలనీ, ఎస్టీ కాలనీ, ఏకలవ్యనగర్ ప్రాంతాలలో నీటమునిగిన ఇళ్లను నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకోవడంతో పాటు ధైర్యం చెప్పారు. వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాగేశ్వరరావు సూచించారు. తమ పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఎలాంటి అవసరం వచ్చినా సంప్రదించాలని సూచించారు. టిఆర్ఆర్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన శిబిరాలకు వెళ్లి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వారితో నాగేశ్వరరావు మాట్లాడారు. భోజనం, మంచినీళ్లు, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. నాగేశ్వరరావు వెంట టిడిపి నాయకులు ఉన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పలువురు నాయకులు నాగేశ్వరరావు వెంట ఉన్నారు.





**భోజన వసతి ఏర్పాటు....**

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో కందుకూరు పట్టణంలోని 1వ వార్డు ఏకలవ్య నగర్, 2వ వార్డు లోని జనార్ధన కాలనీ మరియు బొగ్గుల సంఘం ప్రాంతాల్లో నీట మునిగిన ప్రాంతాల ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో మధ్యాహ్నం ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నాయకులు ముప్పవరపు వేణు, మచ్చా మనోహర్, పందిళ్ళ సురేష్, షేక్ మమ్ముషా, షేక్ కాలేషా, ముచ్చు నరసింహం, షేక్ రసూల్ బి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మిచౌంగ్ తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి: కృష్ణ చైతన్య

అద్దంకి, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని శాప్ నెట్ చైర్మన్ నియోజకవర్గ ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక అధికారులు నాయకులు కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.



రేనంగిపురం రహదారిలోనీ నల్లవాగు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలు సాయం కోరిన వెంటనే అధికారులు స్పందించి వారిని ఆదుకోవాలని అధికారులకు సూచించారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కృష్ణ చైతన్య వెంట స్థానిక అధికారులతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి, సంధి రెడ్డి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేశ్, కౌన్సిలర్లు గుంజి కోటేశ్వరరావు, కొత్త గొర్ల వెంకట సుబ్బారావు, జబ్బర్,నాయకులు రవికుమార్, బాల వీరయ్య, పార్టీలోని వివిధ హొదాలోని నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

# మత్స్యాకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

## - ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మేజర్‌న్యూస్: మీచౌంగ్ తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులను ఎదురుకుంటున్న మత్స్యాకార కుటుంబాలను ప్రభుత్వం ఆడుకోవాలని కొండేపి శాసనసభ్యులు డోలా బాలవీరాంజనేయులు



సూచించారు. మంగళవారం అయన మండల పరిధిలోని పాకల పల్లెపాలెంలో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న మత్స్యాకార కుటుంబాలను పరామర్శించారు. తుఫాన్ వలన వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. వారికి అవసర మైన నిత్య అవసరలు, పునరావాస కేంద్రాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో వేట లేని కారణంగా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే ష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించి న అయన మత్స్యాకారుల సమస్య ను ఫోన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ద్వారా వారికీ సాయం అందించాలని కోరారు. అయన వెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేల్పుల సింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి సుబ్బారావు, పాకాల గ్రామ సర్పంచ్ సైకం చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు అపార పంట నష్టం

కురిచేడు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో పడిన అల్పపీడనం కారణంగా సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలుచోట్ల పంట నష్టం సంభవించింది. ఆరుగాలం కష్టించి అపర భగీరథులైన రైతు ఆశలకు ఈ మిచౌంగ్ తుఫాన్ గండి కొట్టింది. రైతన్నలు ఈ వర్షం దాటికి నూటికాడికి వచ్చిన పంట నేల పాలవటం జరిగింది. ముఖ్యంగా పొగాకు చాలా దెబ్బ తిన్నది. ఆకులు పై ఉన్న మడ్డి మొత్తం ఈ వర్షానికి కారిపోయి, బరువు, రంగు, ఆకు నాణ్యత, కోల్పోతుంది.



అలాగే మిర్చి పంటకు బాగా రేటు ఉండటంతో సాగరు కాలవ రాకపోయినప్పటికీ బావులు బోర్లతో అపర భగీరథుడు వలె రైతు మారిపోయే ఎంతో వ్యయ ప్రయాసాలతో రాత్రనకా పగలనకా నీటి తడులు వేసి పండించిన పంటను ఈ తుఫాను వల్ల మిరప చెట్లు నేలకు వాలినవి. బోర్ల కింద, చెరువుల కింద పండించిన వరి పంట నీట మునిగిపోయినవి. వరి కంకులన్నీ తడిసి పోవడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఆవులు మంద గ్రామంలో మిర్చి పంట నీట మునిగి పోతుంది. అలాగే వరి పొలాలు కూడా నీట మునిగి నేలపాలు అయినవి. అధికారులు స్పందించి అన్నదాతలను వెంటనే ఆదుకోవాలి. లేకపోతే వారి యొక్క కుటుంబ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయ్యి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రైతన్నది.



# నష్టపోయిన పొలాలు పరిశీలన

బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండలంలోని చింతలపాలెం, సోమవారిపేట గ్రామాలలో మంగళవారం వరి సాగు రైతు పొలాలలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాకులు డి.బాల నాయక్ మండల వ్యవసాయ అధికారి



మెర్సి పంట పొలాలలో తిరిగి నష్టపోయిన పొలాలను పరిశీలించారు. సహాయ వ్యవసాయ పంచాకులు బాలా నాయక్ మాట్లాడుతూ ఊరి పేరు పడిపోయినట్లయితే పైరుకు కట్టలు కట్టి చిన్న నీటి కాలువల ద్వారా నీట్ డే పొలం నుండి బయటకు పంపించు కోవాలని పంట రైతులకు సూచించారు. నేలకొరిగితే ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రవణం పిచికారి చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మెర్సీ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్‌కు నష్టపోయిన పంట వివరాలను జిల్లా వ్యవసాయ అధికారులకు నివేదికలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ నాయకులు సుజాత, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

# మండలంలో భారీ వర్షాలు

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలో భారీ వర్షం కురిసింది. ప్రత్యేకించి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు భారీగా వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8:30 సమయానికి 121.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత సాయంకాలం వరకు దఫా దఫాలుగా వర్షం కురుస్తూనే ఉంది. తుఫాన్ ప్రభావం ప్రారంభమైన శనివారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు దాదాపు 150 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో పల్లపు ప్రాంతంలోని వేరుశనగ,మినుము వంటి పైర్లు నీట మునిగాయి. ఈదురు గాలులు వల్ల అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.కరేడు గ్రామపంచా యతీ లోని వాకా గ్రామ పరిసరాల్లో పదేళ్ల వయసు గల మామిడి మొక్కలు వేళ్ళతో సహా పైకి లేచాయి. సోమవారం



మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6 గంటల సమయానికి కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్లపై విరిగిపడిన చెట్లకొమ్మలను స్థానిక ఎస్ఐ ఎ.బాజిరెడ్డి, పోలీసు సిబ్బంది జె.సి.బి సహాయంతో తొలగించారు.

### తుఫాన్ బాధితుల కోసం

## నేను సైతం: వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల రూరల్,మేజర్‌న్యూస్: ప్రజలు కష్టాల్లో ఉంటే అస్సలు ఆగడు కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడమే అతని లక్ష్యం బాపట్ల మండలం అడివిపల్లెపాలెం, కృపానగర్ లోని ఏయమ్ జి పాఠశాల లోని పునరావాస కేంద్రంను పరిశీలించి, వీఆర్వో తో మాట్లాడి ప్రజలకు ఎటువంటి లోటు రానివ్వద్దని, ఏది అవసరమైన తెలియజేయమని, తక్షణమే సహాయం అందిస్తానని బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.పునరావాస కేంద్రంలో సుమారు 350మంది ఉండగా వారికీ అల్పాహారం ఏర్పాటు చేశారా అని వీఆర్వోని అడిగారు. మధ్యాహ్నాం మంచి నాణ్యమైన భోజనం వారికి ఏర్పాటు చేయాలనీ సూచించారు.మీకు అండగా నేను ఉంటానని ఎవరు భయపడవద్దని అన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అని సూచించారు.మీకు ఏది అవసరం అయినా వెంటనే నాకు ఫోన్ చేయండి నేను తక్షణమే మీకు సహాయం చేస్తానన్నారు.అనంతరం అక్కడ స్థానికులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో గోగు శివ, సామియెల్, దానయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత అధైర్య పడవద్దు ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధం



రేపల్లె, మేజర్‌న్యూస్: అన్నదాత అధైర్య పడవద్దు ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మంగళవారం మిచాంగ్ తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. అనంతరం రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని కల్పించారు.ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ పంట నష్టం జరిగిన రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రైతాంగం ఏమాత్రం దిగులు చెందాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేయడం జరిగిందని చేప్పారు. రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయబోదని స్పష్టం చేశారు. ఈ క్రాపు పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రతి ఎకరాకు నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. పంట నష్ట పరిహారం అంచనా ప్రక్రియను ప్రభుత్వ యంత్రాంగం అత్యంత చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. పంటకు నష్టం జరిగిన ప్రతి రైతు నష్టపోయిన ధాన్యపు గింజకు పరిహారం ఇవ్వడం జరుగు తుందన్నారు. తుఫాను తీవ్ర రూపం దాల్చక ముందే ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని, తీరప్రాంత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని వివరించారు. మోపిదేవి వెంట గ్రామ సర్పంచ్ లోయ బాబు నాంచారయ్య,వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి భానుకోటి, తుంగల శ్రీనివాసరావు, అకిశెట్టి నాగరాజు, నియోజకవర్గ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మండలి అంజయ్య, కౌన్సిలర్ తులసి దుర్గా ప్రసాద్, వ్యవసాయ సహాయక సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్, మండల వ్యవసాయ శాఖ అధికారి వాగోలు బుష్, వైయస్సార్ పార్టీ నాయకులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**అధికారులకు అభినందనలు**

తుఫాను తీవ్రతను అంచనా వేయడంలో ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ముందుంజలో ఉండి సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ మేరకు తుఫాను ముందస్తు సహాయక కార్యక్రమాలకు సారథ్యం వహిస్తున్న అధికారులకు, ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రతి ఉద్యోగికి అభినందనలు తెలిపారు.

# భారీ వర్షాలకు స్థంభించిన జనజీవనం





రేపల్లె, మేజర్‌న్యూస్: మిచాంగ్ తుఫాను ప్రభావంతో జనజీవనం స్తంభించింది, గత రెండు రోజులుగా తీర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని రోడ్లు జలమయమ య్యాయి. చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, ఆటో, రిక్షా కార్మికులు, చేతివృత్తి దారులు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని, ఇందిరా యానాది కాలనీ, రెండవ వార్డు, నేతాజీ నగర్, జగనన్న కాలనీలలు నీట మునిగాయి. తుఫాను ప్రభావంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. రేపల్లె మండలంలోని పేటేరు, పెనుమూడి, బొబ్బర్లంక, పిరాటలంక, రాజు కాల్వ, గంగడిపాలెం, తుమ్మల, మోల్లగుంట, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ, సింగ్ పాలెం, విశ్వేశ్వరం, వడ్డీ వారి పాలెం, కైతేపల్లి, తదితర గ్రామాలలో సుమారు 12 పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఆహారం, తాగునీటి వసతులు కల్పించారు. రేపల్లె పట్టణంలో నాలుగు కేంద్రాలలో లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించారు. ఇది ఇలా ఉండగా నియోజకవర్గంలో కోతకు వచ్చిన వరి పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఆక్వా సాగు చేస్తున్న రైతులకు తుఫాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక చోట్ల చెరువులకు గండ్లు పడటంతో ఆక్వా రైతులు వలలను వేసి రొయ్యలను, చేపలను పడుతున్నారు. అయితే గాలులకు విద్యుత్ సరఫరా నిలిచి పోవటం, చెట్లు పడిపోవడం తో విద్యుత్ తీగలు తెగి సరఫరా లేక రొయ్యలను, చేపలకు ఆక్సిజన్ అందక ఆక్వా ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. కృష్ణ నది లో నుండి సముద్రములోనికి చేపల వేటకు వెళ్లే చిన్న మోటార్ బొట్లు లోనికి వర్షం నీరు చేరడంతో నదిలో నిలిపిన రాజుకాల్వ, లంకేవానిదిబ్బ గ్రామాలకు చెందిన 40 మత్యకారుల బొట్లు మునిగిపోయి నట్లు తీర ప్రాంత రైతులు చెప్పారు. మరో 24 గంటలు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## తూఫాన్ బాధితులకు నరేంద్ర వర్మ భరోసా



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్ బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ గారు బాపట్ల పట్టణంలోని 3,6,7,8, వార్డులలో పర్యటించి నీటమునిగిన ఇళ్లను పరిశీలించారు,3 వ వార్డులో తుఫ్ఫాన్ దాటికి ఒక పూరి గుడిసె కూలి వారు నిరాశ్రాయులు అయ్యారని వారి దృష్టికి వచ్చింది.వెంటనే స్పందించిన అయన తక్షణ సాయం కింద వారికీ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా బయటకు రకండి.ధైర్యంగా ఉండండి అని అన్నారు.ప్రజలు ఎవరికి అయినా సహాయం కావాలి అంటే నన్ను సంప్రదించండి అని భరోసా కల్పించారు.తుఫ్ఫాన్ దాటికి ఎంతో మంది పెదలు నిరాశ్రాయులు అయ్యారమి, ఇప్పటికి అయినా ప్రభుత్వం స్పందించి వారికీ ఆశ్రయం కల్పించాలని అయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- ◆వేల ఎకరాలలో దెబ్బతిన్న పంటలు
- ◆రైతన్నలను తక్షణమే ఆదుకోవాలి
- ◆సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలి
- ◆వాగుల ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం మార్టూరు, పర్చూరు మండలాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో తుఫాను తీవ్రతతో వేలాది ఎకరాలు పంటలు నీట మునియన్నారు. జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మిగ్జామ్ తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో వరి, ప్రత్తి, మిరప, పొగాకు,మొక్కజొన్న పంట పొలాలన్నీ నీట మునిగి కోట్లాది రూపాయిల పంట నష్టం వాటిల్లిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 వేల ఎకరాలలో పంటలు నీట మునిగాయన్నారు. అన్నదాతలు ఆశలపై తుఫాను నీళ్లు చల్లిందన్నారు. తుఫాను సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని అసహనం వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోవ డంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మార్టూరు, పర్చూరు వాగులలో తూటికాడ , గుర్రపు డెక్క,పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వరద నీరు పోయే పరిస్థితి లేక బ్రిడ్జి కానాలు మూసుకుపోయి వరద వెళ్ళే పరిస్థితి లేదన్నారు. మార్టూరులో తెలుగు రైతు ఆధ్వర్యంలో వాగులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటి కాడను తెలుగు రైతు ఆధ్వర్యంలో తొలగించారని ఆయన వివరించారు. రెవెన్యూ పోలీస్, యంత్రాంగం ఇలాంటి సమయాలలో ఉండాలని కానీ ఎవరూ లేకపోవడం విచారకరమన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు బాధితులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సాధ్యమైనంత వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను ప్రభావంతో తీవ్రంగా నష్ట పోయిన రైతాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన ఆదుకునేందుకు త్వరగా పంట నష్టం వివరాలను నమోదు చేయాలన్నారు. తుఫాను నష్ట పరిహారం వేగంగా అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



**కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే**

తుఫాను ప్రభావంతో పంట పొలాలు నీట మునిగాయని వాగులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయని, మార్టూరు పర్చూరు వాగు బ్రిడ్జి కానాలు తూటి కాడ, గుర్రపు డెక్కతో మూసుకుపోయాయని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషాకు వివరించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో తెలుగు రైతు ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా వాటిని తొలగిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. వ్యర్థాలను తొలగించుకుంటే వేలాది ఎకరాలలో వరద ప్రవహించే అవకాశం ఉందని తక్షణమే ఆ దిశగా వాగుల వద్ద పరిస్థితిని సమీక్షించి చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పేదలకు సహాయకు చర్యలు చేపట్టాలని కోరారు.



**రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై వత్తిడి తేవాలి**

తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని అండగా నిలిచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ను కోరారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు అండగా నిలవాలని అధినేత నేతలకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ బాపట్ల పార్లమెంట్ వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధినేతకు వివరించారు. ప్రధానంగా మిరప, వరి, పొగాకు మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని అధినేతకు వివరించారు.పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా 80వేల ఎకరాలలో పంటలు నీట మునిగి పోయాయని తెలిపారు.

## మి చౌంగ్ తుఫాను బాధితులకు జోగయ్యయాదవ్ పరామర్శ



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: మి చౌంగ్ తుఫాను కారణంగా కొత్త పట్నంలో తుఫాను పునరావాస కేంద్రాలను బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ.జోగయ్యయాదవ్ సందర్శించి బాధితులను పరామర్శించారు. అక్కడ స్థానిక ప్రజలతో సమస్య గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా జోగయ్యయాదవ్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సముద్రము అల్లకల్లోలంగా ఉన్న కారణంగా చేపల వేట లేక అనేక మంది పూట గడవక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం కనీసం నిత్యావసర సరుకులు సరఫరా చేయక పోవటాన్ని తప్పుపట్టారు. మంగళవారం 50 పులిహోర పొట్లాలు ఇస్తే సరిపోతుందా అనివిమర్శిస్తూ . ఇలాంటి విపత్కర పరిస్థితులకొరకు కేంద్రము ఇచ్చిన నిధులను కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వము దారి మళ్లించి నది అని. ఇలాంటి పరిస్థితులలో అక్కడ ఒక్క ప్రభుత్వ అధికారి కూడా లేక పోవటాన్ని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు %జూ%. మధుయాదవ్, కాటా రాధాకృష్ణ మూర్తి. కటారి సుధాకర్ యాదవ్ పోలయ్య. సుబ్రహ్మణ్యం. స్థానిక పార్టీ నాయకులూ పాల్గోన్నారు.

## మిచౌంగ్ తుఫాన్ పట్ల ప్రజలకు పలు సలహాలు సూచించిన ఎస్సై నాగమల్లేశ్వరరావు



కంభం, మేజర్‌న్యూస్: ప్రస్తుతం ఏపి ని వణికిస్తున్న మిచౌంగ్ తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్థవీడు ఎస్సై నాగమల్లేశ్వర రావు మండల ప్రజలకు పలు సలహాలు సూచనలు తెలిపారు. ప్రజలు తుఫాన్ ప్రభావానికి గురికాకుండా పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటూ,తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని లోత్తటు ప్రాంతాలకు, వాగులు,, చెరువులు వంటి ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలని అన్నారు.రైతులు పంట పొలాల వద్దకు వెళ్ళినప్పుడు పొలాల వద్ద ఉండే నీటి మోటారు, కరెంట్ పోల్స్ వంటి వాటితో జాగ్రత్త వహించాలని తెలిపారు.మిచౌంగ్ తుఫాన్ దాటికి పెద్ద ఎత్తులో గాలులు వీస్తున్నాయని చెట్ల కింద, పాత పూరి గుడిసెల కింద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.సరైన వసతి లేని వారు స్థానికంగా ఉండే తూఫాన్ షెల్టర్ లు,గుడి, చర్చ్, మసీద్ వంటి వాటిని తాత్కాలికంగా ఉంపయోగించుకోవాలని అన్నారు.ద్విచక్ర వాహనాలపై అత్యవసర పరిస్థితుల్లోనే ప్రయాణం చేయాలని, అటువంటి పరిస్థితి ఎదురైనచో అతి తక్కువ వేగంతో వాహనాలను నడపాలని సూచించారు. చిన్న పిల్లలను గమనిస్తూ ఉండాలని బయటకి వెళ్లకుండా చూసుకోవాలని అన్నారు. నిత్యావసర సరుకులు కూడా ముందుగానే తెచ్చిపెట్టుకోవాలని అన్నారు. ప్రజలకు తుఫాన్ దాటికి ఆరోగ్య పరంగా ఏమైన సమస్యలు ఎదురైనచో బైక్ లు, ఆటో లు వంటి వాటిని ఉపయోగించక 108 వాహనాలను సంప్రదించాలని సూచించారు. అలానే పోలీస్ డిపార్ట్మెంట్ నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉంటామని, అవసరమైన పరిస్థితుల్లో తప్పక సంప్రదించాలని అర్థవీడు ఎస్సై నాగమల్లేశ్వర రావు అన్నారు.

## మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో తీవ్ర పంటనష్టం



సిఎస్‌పురం, మేజర్‌న్యూస్: తుఫాన్ ప్రభావంతో సోమవారం నుండి కురుస్తున్న వర్షానికి మండలంలో పలుగ్రామాల్లో కోతదశలో ఉన్న వరిపంట నీళ్లలో పడిపోయి తీవ్ర పంటనష్టం ఏర్పడినది. మండలంలోని సిఎస్ పురం సహా పలుగ్రామాల్లో అతితక్కువ మంది రైతులు వేసిన వరిపంట కొద్దిరోజుల్లో కోతకు వస్తున్న సమయంలో తుఫాన్ ప్రభావంతో వర్షానికి నీటిపాలవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలో పలుగ్రామాల్లో ఇతర పంటలకు తుఫాను ప్రభావంతో తీవ్రనష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# విరిగిన చెట్లు..విద్యుత్ స్థంబాలు





**వాన దాటి కి ఓరిగిపోయిన మిరప మొక్కలు.**
**తూఫాన్ దెబ్బకు అన్నదాతలకు తీరని నష్టం.**
**మిర్చి రైతులు కోలుకోలేని దెబ్బ.**
**నేల కొరిగిన వరి, కంది**

దర్శి మేజర్‌న్యూస్: మండలం లో మి చౌంగ్ తూఫాన్ ప్రభావం తో రెండు రోజులు నుండి విస్తారం గా వర్షాలు కురుస్తున్నాయి. భారీ ఇదురు గాలు ల తో కూడిన వర్షం కురిసింది. దీని తో పంటలు సాగు చేసిన రైతులు ఈ వర్షం వలన అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 9వేల హెక్టర్ లలో మిరప పంటను సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె, కాయ దశ లో ఉన్నాయి. ఈ వర్షం తో మిరప మొక్కులు నెలకొరిగాయి. మండలం లోని బసిరెడ్డి పల్లె, చందలూరు, శేషవారి పాలెం, తానా చింతల, పోతవరం, మారెడ్డి పల్లె మోటు పల్లె తదితర గ్రామాలలో మిరప పంట ను విస్తారం గా సాగు చేశారు. వరి, బార్లీపొగాకు ,కంది, ఈ వర్షం కారణం గా తూఫాన్ దాటికి పంటలు దెబ్బ తిన్నాయి. తూఫాన్ దాటికి విద్యుత్ స్థంబాలు నెలకొరిగాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద గల చెట్లు విరిగి పోయాయి. ఐదు స్థంబాలు నెల కోరిగాయి. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.ఇదురు గాలులు, వర్షం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలి గాలులు తో ప్రజలు బయటకు రాలేదు. విద్యుత్ లేక పోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# లోతట్టు ప్రాంతాలలో నీటిని వెంటనే తొలగించాలి

**జిల్లా పంచాయతీఅధికారి జి.వి.నారాయణరెడ్డి**



మద్దిపాడు, మేజర్‌న్యూస్: ఏడుగుండ్లపాడు గ్రామంలో గౌరవ జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణ రెడ్డి "మిచౌంగ్" తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అందులో భాగంగా గ్రామానికి ఆనుకొని ఉన్న జాతీయ రహదారిపై వరద నీరు మొత్తము గ్రామంలోకి రావడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మోటర్ల సహాయంతో నీటిని తొలగించవలసినదిగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ లకు సూచించారు. రహదారి వెంబడి సైడు కాలువలు తీయవలసినదిగా ఎన్‌హెచ్ఎఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వరద నీరు వచ్చి ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి భోజన వసతులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి & విస్తరణాధికారి కి తగు సూచనలు ఇచ్చి వసతి ఏర్పాట్లు, పారిశుధ్య నిర్వహణ లో ఎటువంటి ఆలసత్వం ప్రదర్శించరాదని, అలాగే లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వలను యంత్రాల సాయంతో ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు సూర్య ట్రస్ట్ అన్నదానం



ఒంగోలు, మేజర్‌న్యూస్: సూర్య శ్రీదివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలొ ఒంగోలు నగరంలో లోతట్టు ప్రాంతాల్లోని దత్తాత్రేయ నగర్ అరవ కాలనీ ప్రాంతాల్లోని తుఫాను బాధితులకు 200 మంది కి జోరున వర్షం గాలిలో మిచౌంగ్ తుఫాను బాధితులకు అన్నదానం చేశారు. సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాషా ట్రస్ట్ తరుపున తుఫాన్‌కి ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులకి మానవత్వంతో భోజనం ఏర్పాటుచేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సూర్య శ్రీ ట్రస్టు సెక్రెటరీ సర్దార్ భాషా ఎప్పుడు ఇబ్బంది వచ్చినా తన వంతు సేవా కార్యక్రమాలు చేస్తుంటారని తుఫాను కారణంగా వర్షంలో పేదలకు అన్నం పెట్టి కడుపు నింపడం మంచి సేవా కార్యక్రమం అని తెలిపారు.

తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని కాలనీవాసులకు ఇల్లు దెబ్బ తిన్నవారికి ఆర్థిక సాయంతో పాటు బియ్యం నిత్యవసర వస్తువులు ప్రభుత్వం అందించాలని కోరారు. ఎఈ సేవ కార్యక్రమంలో జనసేవ శ్రీనివాసరావు, వై సుధీర్. భూపతి రమేష్. పవన్. కార్తీక్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



ఉలవపాడు మేజర్‌న్యూస్: కందుకూరు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ యస్.యస్ శోభిక కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి వేరువేరుగా మంగళవారం పర్యటించారు. మండలంలోని పునరావాస కేంద్రాలను సబ్ కలెక్టర్ పలుమార్లు పర్యటించారు. చాకిచర్ల,కరేడు రామాయపట్నం, ఉలవపాడు, మన్నేటికోటలోని పునరావాస కేంద్రాలను ఆమె సందర్శించారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు భోజనాలు, మంచినీరు ఇతర వసతులు సమకూర్చేలా ఆమె పర్యవేక్షించారు.మరోవైపు కందుకూరు ఎమ్మెల్యే మానుకుంట.మహీధర్ రెడ్డి మండలంలోని పునరావాస కేంద్రాల్లో పర్యటించారు.

కరేడులోని బాలకోటయ్య సంఘం,చాకిచర్ల తుఫాన్ షెల్టర్, ఉలవపాడులోని పునరావాస కేంద్రాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్రెడ్లు,బిస్కెట్లు పంపిణీ చేశారు.వీరి వెంట తహశీల్దార్ ఆర్.బ్రహ్మయ్య,ఎంపిడిఓ యల్. చెంచమ్మ, ఎస్.ఐ.ఎ.బాజిరెడ్డి,ఉప సర్పంచ్ టి. శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

## గౌరవ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న మొర్రి పిచ్చయ్య యాదవ్



గిద్దలూరు మేజర్ న్యూస్: గిద్దలూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలి కొండపల్లెలో హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న మొర్రి పిచ్చయ్యకు విద్య, సోషల్ సర్వీసెస్, హ్యూమన్ రైట్స్, హ్యూమానిటీ రంగాలలో చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ డిగ్రీని అంతర్జాతీయ గుర్తింపు పొందిన గ్లోబల్ మినిస్ట్రీ అండ్ డిసిపిల్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ చాన్స్ లర్ బిషప్ లారెన్స్ ఒక్వీర్ ఆన్లైన్ ద్వారా ప్రధానం చేశారు. మొర్రి పిచ్చయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుగా పనిచేస్తూ యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించి గత 20 సంవత్సరాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విద్య మరియు సోషల్ సర్వీసెస్ కార్యక్రమాలను తన వేతనంలో 20 శాతం డబ్బులను ఖర్చు చేస్తు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసి పోటీ పరీక్షలు రాయుటకు ప్రోత్సహిస్తున్నారు. కోవిడ్ కష్టకాలంలో పేద ప్రజలకు నిత్యవసర వస్తువులను అందించారు. సమాజానికి ఉపయోగపడే అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ తనకు ఈ గౌరవ డాక్టరేట్ డిగ్రీని అందుకోవడం ఆనందంగా ఉందని మరియు ప్రధానం చేసిన ఇన్స్టిట్యూట్ చాన్స్ లర్ కు, కమిటీ సభ్యులు మనం ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు లాయర్ చక్రవర్తి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మొర్రి పిచ్చయ్య ను పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

## విద్యుత్ సిబ్బంది కృషికి ప్రజల అభినందనలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాన్ వల్ల మండలంలో సోమవారం రాత్రి నుండి కురిసిన వర్షానికి కరెంట్ తీగలు తెగి చెట్లుపడి పోవడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో మంగళవారం మధ్యాహ్నానికి విద్యుత్ పునరుద్ధరించడం పట్ల మండల ప్రజలు విద్యుత్ అధికారులు సిబ్బంది కృషికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుండి మండల విద్యుత్ ఎఇ రామ్మోహనరెడ్డి అధ్వర్యంలో సిబ్బంది సి.ఎస్.పురం, కోవిలంపాడు, డిజిపేట సబ్ స్టేషన్ల పరిధిలో పలుగ్రామాలకు విద్యుత్ లైన్లు బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ అధికారులు సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ అందించారు.

## చెరువులకు దండిగా నీరు



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను వర్షాల వల్ల ఉప్పుటేరు, ఎల్లికేరు, మన్నేరుకు వరద ప్రవాహం వచ్చింది. ఉప్పుటేరుకు వరద ప్రవాహం రావడంతో మండలంలోని భీమవరం, బద్దిపూడి చెరువులకు దండిగా నీటి ప్రవాహం సాగింది. మన్నేరుకు వరద నీరు రావడంతో కరేడు,చాకిచర్ల చెరువులకు నీరు సరఫరా కొనసాగుతుంది. వర్షాధార చెరువులైన చాకిచెర్లలోని సీతమ్మ చెరువు వీరేపల్లిలోని చెరువులు రాయపట్నం చెరువు, కె.రాజుపాలెం, ఎల్.రాజుపాలెం చెరువులకు దండిగ నీరు చేరింది. చాగొల్లు చెరువు ఇంతకుముందే నిండిన విషయం తెలిసిందే.

## తుఫాన్ బాధితులకు ఎంఎం కొండయ్య సాయం

చీరాల, మేజర్ న్యూస్: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎంఎం కొండయ్య తుఫాను కారణంగా నిరాశ్రయులైన వారికి తన వంతు సాయం అందజేశారు. స్థానిక సావరపాలెం స్ట్రైట్‌కట్ వద్ద నివసిస్తున్న నిరుపేదలకు



మంగళవారం ఎంఎం కొండయ్య ఆహార పొట్లాలలను నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎం కొండయ్య మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను కారణంగా నియోజకవర్గంలోని ప్రజలెవ్వరూ ఇబ్బందులు పడకుండా టిడిపి నాయకులు వారికి అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమలో యువనేత యం అమర్నాథ్, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేమున్నాం ప్రజలెవరూ ఆందోళన పడొద్దు



చీరాల, మేజర్ న్యూస్: ప్రజలు ఎవరూ ఆందోళణ పడవద్దు అని కలెక్టర్ రంజిత్ బాష మరియు ఎస్పీ వకుల్ జిందాల్‌తో పాటు శాసన సభ్యుడు కరణం బలరాం దైర్యం చెప్పారు. మండలంలోని వాడరేవు సముద్ర తీరం వద్ద ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఏర్పాటు చేసిన షెల్టర్‌లను మంగళవారం కలెక్టర్, ఎస్పీ మరియు శాసన సభ్యుడు కరణం బలరాంను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఈ రోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. తుఫాను కారణంగా ప్రజలకు వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని హామి ఇచ్చారు. రోడ్లపై పడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికనా తొలగిస్తున్నామని, లోతట్టు ప్రాంతాలలో ఉన్న వారిని సురక్షితంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాలలోకి తరలిస్తున్నామని అన్నారు. సప్టాల వద్ద, రోడ్లపైన నీరు ప్రవహించే ప్రదేశాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఫ్ దళా లతో అవసరమైన చోట్ల సేవలందిస్తున్నామని అన్నారు. జిల్లాలోని సిబ్బంది అందరూ తమ శక్తివంచన లేకకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, పోలీస్ సిబ్బంది సూచించే నియమ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే తక్షణ సహాయం కొరకు డయిల్ 100, 112 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 833813228తో పాటు స్థానిక పోలీసు అధికారులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు సూచించారు.

## కరణం బలరాం సుడిగాలి పర్యటన

చీరాల రూరల్, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాన్‌లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు శాసన సభ్యుడు కరణం బలరాం సుడిగాలి పర్యటనను నిర్వహించారు. భారీ వర్షాన్ని సైతం లక్ష్యపెట్టకుండా మంగళవారం లోతట్టు ప్రాంతాలలో జలమయమైన ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలను



తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్క రించారు. స్థానిక సెయింటాన్స్ స్కూల్ ఉన్న అవరకాలనీలో పర్యటించి అక్కడ ప్రజలకు స్కూల్లో పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా దండుబాటలో ఉన్న లోతట్లు ప్రాంతాలను సందర్శించి, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సల్లూరి అనిల్, కౌన్సిలర్ కీర్తి వెంకటరావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డొక్కా కొండయ్య తదితర వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## నిరాశ్రయులకు ఎంఎం కొండయ్య సాయం

చీరాల, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాను కారణంగా నిరాశ్రయులైన వారికి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎంఎం కొండయ్య తన వంతు సాయం అందజేశారు. స్థానిక స్వర్ణ గేటు యానాదికాలనీలో నివసిస్తున్న పేదలు తుఫాను కారణంగా పనులు లేకపోవడంలో ఆకలితో అలమటిస్తున్న వారికి ఎంఎం కొండయ్య నాయకులతో కలిసి ఆహార పొట్లాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎం కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అండగా ఉన్నారని ప్రజలు దైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువనేత యం అమర్నాథ్, గజవల్లి శ్రీనివాసరావు, లావేటి శ్రీనివాసతేజ తదితర నాయకులున్నారు.

## మిచౌంగ్ తుఫానుతో రైతులకు భారీ నష్టం



పర్చూరు, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాను కారణంగా పంటలు నీట మునిగి రైతులకు భారీగా నష్టం వాటిల్లిందని ఆందోళణ చెందుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాల్లోకి నీరు చేరి చెరువులుగా మారాయి. పర్చూరు వాగుకు భారీగా నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. పంట పొలాలు అయిన మినుము, మిర్చి, పొగాకు, శనగ, ప్రత్తి తదితర పంటల్లో నీరు చేరడంతో మొక్కలు నీట మునిగాయి. మండల కేంద్రమైన పర్చూరు లోని అన్ని రోడ్లు, ప్రధాన



రహదారులు నీటిమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక ఆర్‌అండ్‌బి బంగ్లా, రోడ్లు అన్నీ నీటితో మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంచాయితీ సిబ్బంది నీటిని బయటకు పంపించేందుకు నానా తంటాలు పండాల్సి వస్తుంది. వేణుగోపాల స్వామి ఆలయంలోకి నీరు చేరడంతో ఇంజన్ల ద్వారా నీటిని బయటకు పంపుతనన్నారు. జయంతి కాలనీ, మూడో వార్డు శివారులలోకి వాగు నీరు చేరడంతో ఇళ్ళు కొన్ని నీట మునిగి ప్రజలు పలు అవస్థలుపడుతున్నారు. పర్చూరు-ఇంకొల్లు, పర్చూరు-చిలకలూరిపేట, పర్చూరు-గుంటూరు రోడ్లుకు ఇరువైపుల ఉన్న పంట పొలాలు అన్ని నీట మునిగాయి. అదే విధంగా చెరుకూరు, ఉప్పుటూరు, వీరన్నపాలెం, పోతుకట్ల గ్రామాల పరిసర ప్రాంతాలలో ఉన్న పంట పొలాలు కూడా నీట మునిగి రైతులకు కన్నీరునే మిగిల్చాయి.

## డ్రైనేజీలో పడి వ్యక్తి దుర్మరణం

చీరాల రూరల్, మేజర్ న్యూస్: మురుగుకాలువలో పడి వ్యక్తి దుర్మరణం పొందిన దుర్ఘటన మంగళవారం స్థానిక విజిలీపేట అవరకాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్థానిక అవరకాలనీలో నివాసముంటున్న వ్యక్తి మూత్ర విసర్జన కై కాలువ వద్దకు లాగా ప్రమాదవాశాత్తు కాలు జారీ డ్రైనేజీలో పడ్డాడు. తుఫాను కారనంగా డ్రైనేజీలో నీరు నిండుగా ప్రవహిస్తుండంతో మురుగుకాలువ నుంచి వ్యక్తి బయటకు రాలేక ఊపిరాడక మరణించినట్లు తెలిపారు. మద్యం అలవాటు ఉండడంతో మద్యం మత్తులో వ్యక్తి కాలువ వద్దకు మూత్ర విసర్జనకై వచ్చి కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు. వ్యక్తి మృతి చెందినవిషయాన్ని తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృత దేహాన్ని పరిశీలించి, శవ పరీక్ష నిమిత్తం ఏరియా హాస్టటల్‌కు తరలించి, వివరాల నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.



## అంధకారంలో టంగుటూరు మండలం

టంగుటూరు, మేజర్‌న్యూస్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ వలన గత నాలుగు రోజుల నుండి మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో సోమవారం రాత్రి 7 గంటల నుండి మంగళవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో మండలంలోని గ్రామాలు అంధకారముతో అలుముకుంది. విద్యుత్ సరఫరా లేకపోవటంతో మండలంలోని ప్రజలు వార్తా సమాచారం తెలుసుకొనుటకు టీవీలు, సెల్ ఫోన్‌లో వార్తలు చూసి ఎందుకు వీలు లేక మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిపివేసినందున త్రాగునీరు లేక మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తుఫాను ప్రభావం వలన మండలంలోని వందల ఎకరాలలో మినుము, పొగాకు పంట పొలాలకు నీరు చేరడంతో రైతులు విచారములో మునిగిపోయారు. తుఫాను సందర్భంగా సముద్ర తీర ప్రాంతాల గ్రామాల ప్రజలను కొంతమందిని ముందస్తు జాగ్రత్తలో భాగంగా రెండు పునరావాస కేంద్రాలకు తరలించి వారికి రెవెన్యూ అధికారులు వసతులను ఏర్పాటు చేశారు. సముద్ర తీర ప్రాంత గ్రామ ప్రజలకు ఎలాంటి ప్రాణాపాయం నష్టం కలగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలను తీసుకున్నారు. గత నాలుగు రోజుల నుండి కురిసిన భారీ వర్షాల వలన మండలంలోని అనేక గ్రామాలలోని పంట పొలాలు నీరు చేరటం వలన పొలాలు చెరువు లాగా కనిపిస్తున్నాయి. మండలంలోని వల్లూరు చెరువు నీటితో కళకళలాడుతుంది. మొత్తం మీద తీవ్ర తుఫాను వలన మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## తుఫాన్‌లో నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ అధికారులు





కురిచేడు, మేజర్‌న్యూస్: క్షణం విద్యుత్ సరఫరా ఆగిపోతే మనిషి మనుగడ స్తంభించి పోతుంది, అనడంలో అతిశయోక్తి లేదు. సోమవారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా మిచౌంగ్ తుఫాన్ కురుస్తుండటంతో మండలంలో విద్యుత్ తీగలపై చెట్లు కొమ్మలు విరిగి పడిపోవడంతో కరెంటు సరఫరా సమస్య మండలంలో పలుచోట్ల ఏర్పడింది. అయితే రాత్రనకా పగలనకా విద్యుత్ అధికారులు వర్షం సైతం లెక్కచేయకుండా వారి అందిన సమాచారం ప్రకారం వెళ్లి వెంటనే బాగు చేయటం జరిగింది. విరిగిన చెట్టు కొమ్మలని వెంటనే తొలగించటము, విద్యుత్ తీగలు జామై విద్యుత్ ట్రాన్స్ఫారాలు కాలిపోవడం జరిగినవి. అక్కడికక్కడ వెంటనే విద్యుత్ సిబ్బంది రిపేర్లు చేయటం జరిగింది. జోరున వర్షం కురుస్తున్న, చలిగాలులు వీస్తున్న, లెక్కచేయకుండా ప్రజలకు అవసరమైన విద్యుత్తును అంతరాయం లేకుండా అందించాలని ఉద్దేశంతో కురిచేడు మండల విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది నిరంతరం మండలంలో అన్ని పంచాయతీలు తిరుగుతూ ఎక్కడ ఎలాంటి విద్యుత్ అంతరాయం ఏర్పడిన, వెంటనే రిపేర్ చేసి విద్యుత్ సరఫరా అందించారు. దర్శి నుండి కురిచేడు వరకు కురిచేడు నుండి ఆవులమంద, కాశీపురం, పెద్దవరం ముష్ట గంగ వరం, పడమర గంగావరం, గ్రామాల వరకు తిరుగుతూ ఒక నిఘ వేస్తూ విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికగా తమ సర్వీస్ ప్రజలకు అందించారు. వారి సహోపేతమైన విధి నిర్వహణ చూసి మండల ప్రజలు ప్రశంసలు కురిపించారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: 'మిచౌంగ్' తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అందులో భాగంగా లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న యెడల మోటార్లు, జెసిబి లతో తొలగించాలని, సైడ్ కాలువల పూడికలు తీయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట బ్లీచింగ్, సున్నం చల్లాలని తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధి కారులు తగు చర్యలు చేపట్టి పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారులు వారి వారి డివిజన్లలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## తీరప్రాంత గ్రామాల్లో ఇంటూరి పర్యటన



ఉలవపాడు, మేజర్ న్యూస్: కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి.నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం సముద్ర తీర ప్రాంతాల్లోని గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని చాకిచర్ల, చిన్నపట్టపుపాలెం, చిన్నపల్లెపాలెం గ్రామాల్లో ప్రజలను పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం తరపున వసతులు సరిగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు.వారికి ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.వర్షాలకు దెబ్బతిన్న వలలను ఆయన పరిశీలించారు.తమకు జీవనాధారమైన వలలు పూర్తిగా దెబ్బతిన్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులతో మాట్లాడి సహాయం అందేలా కృషి చేస్తానని నాగేశ్వరావు వారికి హామీ ఇచ్చారు.చిన్నపల్లెపాలెం గ్రామంలో నూ ఆయన పర్యటించారు.ఏ అవసరం ఉన్నా తమ పార్టీ నాయకులకు సమాచారం ఇస్తే,సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట చాకిచర్ల గ్రామ పార్టీ అధ్యక్షుడు మిరియం.మల్లికార్జున,పార్టీ నాయకులు ఎందేటి. శ్రీను,ఇతర నాయకులు ఉన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజల అప్రమత్తంగా ఉండాలి

### ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్ షరీఫ్

జరుగుమల్లి, మేజర్ న్యూస్ : తుఫాన్ ప్రభావం వల్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్ షరీఫ్



తెలిపారు మంగళవారం మండల పరిధిలోని వావిలేటిపాడు గ్రామంలో లోతట్టు గ్రామం గా గుర్తించారు అయితే గ్రామంలో వర్షపు నీరు లోపలికి ప్రవేశించకుండా గ్రామంలో ఉన్న ప్రజలకు ఏ విధంగా సౌకర్యం ఏర్పాటు చేయాలో లేదా తుఫాన్ సెంటర్కి తీసుకువెళ్లాలో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య వీఆర్వోలు గ్రామ వాళ్ళింట్లో పాల్గొన్నారు

## తుఫాన్ బాధితులకు సూర్య శ్రీ ట్రస్ట్ అన్నదానం

ఒంగోలు, మేజర్‌న్యూస్: సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో లోతట్టు ప్రాంతాల్లోని దత్తాత్రేయ నగర్ అరవ కాలనీ ప్రాంతాల్లోని తుఫాను బాధితులకు 200 మంది కి జోరున వర్షం గాలిలో మి చౌంగ్ తుఫాను బాధితులకు అన్నదానం చేయడమైనది.





సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాషా ట్రస్ట్ తరుపున తుఫాన్ కి ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులకి మానవత్వంతో భోజనం ఏర్పాటుచేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సూర్య శ్రీ ట్రస్టు సెక్రెటరీ సర్దార్ భాషా ఎప్పుడు ఇబ్బంది వచ్చినా తన వంతు సేవా కార్యక్రమాలు చేస్తుంటారుఅని తుఫాను కారణంగా వర్షంలో పేదలకు అన్నం పెట్టి కడుపు నింపడం మంచి సేవా కార్యక్రమం అని తెలిపారు. తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని కాలనీవాసులకు ఇల్లు దెబ్బ తిన్నవారికి ఆర్థిక సాయంతో పాటు బియ్యం నిత్యవసర వస్తువులు ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ సేవ కార్యక్రమంలో జనసేవ శ్రీనివాసరావు . వై సుధీర్. భూపతి రమేష్. పవన్. కార్తీక్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమీషనర్ విస్తృత పర్యటన

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు నగరములో మిచౌంగ్ తుఫాను తీవ్రత దృష్ట్యా కమీషనర్ నగరమంతా విస్తృతంగా పర్యటించారు. ఒంగోలు నగరములో ఉదయము నుండి కురుస్తున్న భారీ వర్షాలు దృష్ట్యా కమీషనర్ నగరపాలక సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రోడ్ల పై నిలువ ఉన్న వర్షపు నీటిని కలువలలోకి తరలించే ప్రక్రియయను మరియు ఎదురు గాలులకు రోడ్లపై పడిన చెట్ల కొమ్మలను తొలిగించే కార్యక్రమమును దగ్గరుండి పర్యవేక్షించారు. పేర్నమిట్ట చైతన్య కాలేజీ దగ్గర కర్నూల్ రోడ్ సి ఎం ఆర్



షాపింగ్ మాల్ దగ్గర రోడ్ల పై వర్షపు నీరు ఎక్కువగా నిలిచి ఉండడం గమనించి దగ్గరుండి వర్కర్స్ తో తొలిగించే చర్యలను పర్యవేక్షించారు. నేతాజీ కాలనీ, పాత మార్కెట్ ప్రాంతం దగ్గర రోడ్లు శుభ్రపరచడం, వర్షపు నీరు నిలువ ఉండకుండా కలువలలోకి తరలించడం కూడా పర్యవేక్షించారు. ప్రకాశం కాలనీ దగ్గర పోతురాజు కాలువలోని జమ్మిని



తొలిగించే కార్యక్రమము పర్యవేక్షించారు.

సంఘమిత్ర హాస్పిటల్ దగ్గర నల్ల కాలువను శుభ్రపరిచే కార్యక్రమములో పాల్గొన్నారు ప్లాస్టిక్ కవర్లు వర్షపు నీరు వెళ్ళుటకు అడ్డుగా ఉండడం గమనించివాటిని తొలిగించడం జరిగినది.

ఈ కార్యక్రమములో కమీషనర్ గారితో పాటు ఏసిపి కె. వెంకటేశ్వర్లు , ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది మరియు మునిసిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.



# కందుకూరులో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

**- తుఫాన్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మహీధర్ రెడ్డి**

**- అధికారులను అప్రమత్తంచేసిన సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక**

**- తమిళనాడు మత్స్యకారులు పునరావాసానికి తరలింపు**

**- దుప్పట్లు, భోజన సౌకర్యాలు ఏర్పాటు**

కందుకూరు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కందుకూరు నియోజవర్గంలో భారీ నుంచి అతి భారీ వర్షం నమోదైయ్యింది. తుఫాను తీరదాటే సమయంలో కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు, వివిపాలెం, లింగసముద్రం మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తుఫాను వలన ప్రజలకు ఇబ్బందులు తరలించకుండా సబ్‌కలెక్టర్ ఎస్ఎస్



పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి పునరావాస కేంద్రం పరిశీలించి వారికి కావలసిన ఏర్పాట్లు తో పాటు భోజనం తదితర ఏర్పాట్లు చేశారు. అంతే









శోభికా ఆధ్వర్యంలో అధికార బృందం లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పరిశీలించి అక్కడ ఉన్న వారితో మాట్లాడి వారికి కావాల్సిన వసతులు ఏర్పాటు చేశారు. ఉలవపాడు మండలంలో మిచాంగ్ తుఫాను దృష్ట్యా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఉన్న నిర్వాసితులకు భోజన ఏర్పాట్లు సబ్ కలెక్టర్ శోభిత పరిశీలించారు. రామాయపట్నం పోర్టు నుంచి తమినాడుకు చెందిన మత్స్యకారులను పునరావాసకేంద్రానికితరలించారు.

**పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే...**

మిచౌంగ్ తుఫాన్ కారణంగా కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో కాకుండా పునరావాస కేంద్రంలో ఉన్న వారికి మీరేం భయపడవద్దు తాను అండగా వుంటాను అని భరోసా ఇచ్చారు.

**దుప్పట్లు అందజేత...** కందుకూరు పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డు సుందరయ్య నగర్ పునరావాస కేంద్రంలో తల దాచుకున్న తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమములో పట్టణ వైయస్సార్ సీ పీ అధ్యక్షులు ఎస్.కె. రఫీ, మండల అధ్యక్షులు గంగవరపు వెంకట్రావు, కొండి కందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, గణేశం గంగిరెడ్డి, వైకాపా నాయకులు మహబూబ్ బాషా, రహిం తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా సహాయ చర్యలు చేపట్టిన కమీషనర్ మనోహార్

**- కూలినచెట్లు, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు**

కందుకూరు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో ఈదురు గాలులు, భారీ వర్షంతో జనజీవనం స్థంభింది. కందుకూరు పట్టణంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా కమీషనర్ ఎస్ మనోహార్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సహాయ



చర్యలను వేగవంతంగా నిర్వహించారు. రోడ్లపై పడిపోయిన చెట్లను, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను జెసిబితో తొలగించారు. పునరావాస కేంద్రాలను కమీషనర్ పరిశీలించి అక్కడ ఉన్న వారికి అన్ని సౌకర్యాలతో పాటు భోజన వసతిని ఏర్పాటు చేసే విధంగా సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి సేవలను అందజేశారు. కందుకూరు సుల్తాన్ మొహిద్దిన్ నగర్లో భారీ వృక్షం విరిగి విద్యుత్ వైర్ల మీద పడటం వలన రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెంటనే మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. తుఫాను నేపథ్యంలో వివిధ సహాయక చర్యల్లో భాగంగా పురపాలకసంఘ శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొని కూలిన చెట్లను తొలగించడం, డ్రైవ్ లో ఉన్న చెత్త తొలగించడం చేయడం జరిగింది. అర్ధరాత్రి టౌన్ లోపల కు వచ్చు పలు వాగుల దగ్గర పురపాలక సిబ్బంది పోలీస్ డిపార్ట్మెంట్లో సంయుక్తంగా వాగులు దాటకుండా ముళ్ళకంచెలు వేశారు. నీటి సరఫరా జరగని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడం జరిగింది. ఏఎంసీ కాంపౌండ్, పాలిటెక్నిక్ కాలేజ్ ,సుందరయ్య నగర , శ్రీనగర్ కాలనీ ఎక్కడికి అక్కడ బస ఏర్పాటు చేసి సుమారుగా 350 కి పైగా ప్రజలకు బస భోజన ఏర్పాట్లు పురపాలక సంఘం చే ఏర్పాటు చేయడం జరిగింది.





## నియోజకవర్గప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్ర వ్యాప్తంగా మిచౌంగ్ తుఫాన్ కారణంగా గిద్దలూరు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు చేరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, విద్యుత్ స్తంభాల వద్దకు చిన్నపిల్లలు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అదే విధంగా రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని పంటలు నష్ట పోకుండా వారికీ తగిన సహకారం అందించాలన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గోనాలని పిలుపునిచ్చారు.



## వరద బాధితులకు నిత్యవసర వస్తువులు పంపిణీ

అద్దంకి, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాన్ కారణంగా సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా అద్దంకి పట్టణం లోని 20వ వార్డ్ ఎన్టీఆర్ నగర్ లోతట్టు ప్రాంతంలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఇళ్లలోంచి



ఎవరు బయటకు వచ్చే పరిస్థితులు లేని నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు కోనేటి అనిల్ కుమార్ తన అనుచరులను పంపి నిత్యవసర సరుకులు కూరగాయలను బాధితులకు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలోని సుమారు 40 కుటుంబాలకు పైగా ఉండగా వారందరినీ పరామర్శించి నిత్యవసర వస్తువులు పంపిణీ చేసినట్లు కోనేటి అనిల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తోకల రాజేష్, దుర్గ, వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

# మిచౌంగ్ తుఫానుతో పంటలకు అపార నష్టం

సంతమాగులూరు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుఫాను దెబ్బకు మండలంలో పంటలకు అపార నష్టం వాటిల్లినట్టు రైతులు వాపోతున్నారు మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపిలేని తుఫాను కారణంగా మండలంలో రైతులకు అపార నష్టం వాటిల్లింది మండల వ్యవసాయ అధికారి లావణ్య మండలంలోని పంట పొలాలను పరిశీలించారు మండలంలోని వెల్లలచెరువు కామేపల్లి అడవి పాలెం సంతమాగులూరు



ఏల్చూరు కొప్పరం కొమ్మలపాడు మిన్నికల్లు మామిళ్ళపల్లి కుందుర్తి గ్రామాలలో ప్రతి మిరప బొప్పాయి వరి పంటలకు నష్టం వాటిలినట్లు ఆమె పరిశీలించిన అనంతరం తెలిపారు ప్రాథమిక అంచనాల ప్రకారం మండలంలో వరి 468 ఎకరాలు మినుము 142 ఎకరాలు మొక్కజొన్న 245 ఎకరాలు శనగ 1144 ఎకరాలు కంది 63 ఎకరాలు నష్టపోయినట్లు నష్టపోయిన పంటల వివరాలు బుధవారం కూడా పరిశీలిస్తామని పంట నష్టం పెరిగే అవకాశాలు ఇంకా ఉన్నాయని ఆమె తెలిపారు.



# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**కనిగిరి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కెలం ఇంద్ర భూపాల్ రెడ్డి.**

వెలిగండ్ల, మేజర్ న్యూస్: మీ చాంగ్ తుఫాన్ వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని నష్టపరిహారం 20వేల రూపాయలు ఎకరాకి ప్రభుత్వం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కనిగిరి నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని మరపగుంట్ల పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ చాంగ్ తుఫాన్ వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం 20వేల రూపాయలు ఎకరాకి నష్టపోయిన రైతులకు అందించాలని ప్రభుత్వం తూతూ మంత్రంగా చేతులు దులుపుకునే కార్యక్రమం చేయడం మానుకోవాలని వెంటనే పంచాయతీలోని ప్రతి గ్రామంలోని పొలాలను పరిశీలించి కంది మినిమం పొగాకు ఇతర పంటలను తనిఖీ చేసి నష్టపోతున్నటువంటి రైతులను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ రైతు విభాగం కనిగిరి తెలుగు రైతు అధ్యక్షులు కోరారు.



## తుఫాన్‌తో నష్టపోయిన మిర్చి, పొగాకు రైతులు

వెలిగండ్ల, మేజర్ న్యూస్ : గత రెండు రోజుల నుంచి ఎల్లిగండ్ల మండలంలో మీ చాంగ్ మండలంలో వేసిన పొగాకు మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారు సుమారు 5000 ఎకరాల రైతు పొగాకు రైతులు 300 ఎకరాలు వేసిన మిర్చి రైతులు ఈ తుఫాను వల్ల నష్టపోయి ఆందోళన వ్యక్తులు చేస్తున్నారు ప్రభుత్వం ఆ రైతులను నష్టపరిహారం అంచనాలేసి బాధితులను ఆదుకోవాలని మండలంలో రైతులు కోరుతున్నారు మండలంలోని గోకులం సమీపంలో కరెంటు స్తంభాలు పడిపోయి రోడ్డుపై 24 గంటలు మండలంలో విద్యుత్ అంతరాయం విద్యుత్తు లేనందున మండలంలో జిఓ ఎయిర్టెల్ బిఎస్ఎన్ఎల్ టవర్లు పనిచేయక ప్రజలు ఇబ్బంది పడ్డారు ఏర్పడింది ఈ తుఫాన్ కారణంగా కేవలం కంది పంట వేసిన రైతులు కొంత ఊరట చెందినారు మినుము బొబ్బర్లు వేసే రైతులు పూర్తిగా నష్టపోయారు

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

- ఉగ్ర నరసింహారెడ్డిని మరో మారు ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం
- ఐ టిడిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్నేని రామకృష్ణ



పామూరు, మేజర్‌న్యూస్: రాష్ట్రానికి పూర్వ వైభవం తేవడం ఒక్క నారా చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని ఐ టిడిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్నేని రామకృష్ణ అన్నారు. సోమ వారం మేజర్ న్యూస్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా మార్నేని రామకృష్ణ మాట్లాడుతూ మళ్లీ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి ఎమ్మెల్యే అయితేనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యం అన్నారు. ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. పన్నులు చార్జీలు పెంచనని హామీలు గుప్పించిన జగన్ అధికారంలోకి రాగానే ప్రజలపై ఎడాపెడా బస్సు, కరెంటు చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు పెంచారన్నారు. టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా అమలయ్యాయన్నారు.రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును గెలిపించు కుందా మన్నారు.

## అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరి, అరటి రైతులు



కంభం, మేజర్‌న్యూస్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో,అరటి మరియు వరి పంట పూర్తిగా నెలకొరిగి పంట నష్ట పోవటం జరిగింది. వ్యవసాయన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులకు ఈ అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అకాల వర్షంతో నష్టపోయిన రైతులు, ఇతర గ్రామాల్లో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోని, వారికి పంట నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుచున్నారు..

## ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి:కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుపాను ప్రభావం ఉన్నందున బాపట్లలో ప్రాణ, ఆస్తి, జంతు నష్టం జరగకుండా అధికారులు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. చీరాల ఓడరేవు సముద్ర తీరంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, చీరాల శాసనసభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తితో కలిసి ఆయన మంగళవారం పర్యటించారు. తదుపరి ఆయన స్థానిక కలెక్టరేట్ కు చేరుకుని జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ... టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, జిల్లా అధికారులు, తహశీల్దార్ కు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఓడరేవు సమీపంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాధితులతో కలెక్టర్ మాట్లాడి వారికి భరోసా కల్పించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు పునరావాసం కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 24 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో ఇప్పటివరకు 1,114 మందికి ఆశ్రయం కల్పించమన్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా తాగునీరు, నాణ్య మైన భోజనం, అల్పాహారం తయారుచేసి వడ్డించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పునరావాస కేంద్రాల నుంచి నిర్వాసితులు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం నగదు పంపిణీ చేయాలన్నారు. ఇళ్లకు వెళ్లిన 48 గంటలలోపు వారందరికీ నిత్యావసర సరుకులు పంపిణి చేయాలన్నారు. తుపాను తీరం దాటిన వెంటనే వైద్య శిబిరాలు, పశువుల కొరకు పశు వైద్య శిబిరాలు ఆయా ప్రాంతాలలో విధిగా ఏర్పాటు చేయాలన్నారు. తుపానుతో విద్యుత్ స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోతే సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా యుద్ధప్రాతిపదికన అధికారులు సహాయక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు.

ఇప్పటికే పలుచోట్ల గాలులకు చెట్లు కిందపడిపోతే రహదారులు పునరు ద్ధరించడానికి అత్యంత వేగంగా చర్యలు తీసుకోవడంపై అధికారులను అభినందించారు. తీరం దాటిన 48 గంటల తరువాత నష్టాలపై పూర్తిస్థాయిలో సర్వే చేసి వారం రోజులలో నివేదికలు పంపాలన్నారు.

తాగునీరు సరఫరా, రహదారుల పునరుద్ధరణ, పంట కాల్వలకు సంబంధించిన మరమ్మతులలో జాప్యం చేయరాదని ఆయన స్పష్టం చేశారు. గృహాలు దెబ్బతింటే అర్హులైన వారందరికీ వారం రోజుల్లో పరిహారం పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట చీరాల ఆర్డీవో పి సరోజిని, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో- సూరారెడ్డిపాలెం వద్ద నున్న ఐ.ఓ.సి. డిపోను కొనసాగించమని కోరిన మాగుంట



ఒంగోలు, మేజర్‌న్యూస్: పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం డిల్లీలో కేంద్ర పెట్రోలియం, నాచురల్ గాస్ సెక్రటరీ పంకజ్ జైన్, ఐ.ఏ.ఎస్‌ని ఆయన కార్యాలయంలో కలసి ఒంగోలులో-సూరారెడ్డిపాలెం ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వారి ఆయిల్ డిపోను కొనసాగించమని కోరారు. ఈ డిపో నుండి ప్రతి నిత్యం చిత్తూరు, కడప, గుంతకల్, కొండపల్లి, విజాగ్, చెన్నై డిపోలకు ఆయిల్ టాంకర్ల ద్వార ఆయిల్ సరఫరా జరుగుతుందని, ఈ టాంకర్లకు సంబందించిన 250 కుటుంబాలకు చెందిన 2,000మంది, దీనికి అనుబందంగా ఇతర కుటుంబాలు ఈ డిపో మీద ఆధారపడి జీవించుచున్నారని, ఈ మధ్య ఈ డిపోను మూసివేస్తున్నారని రూమర్లు విన్నా మని కనుక ఈ డిపోను కొనసాగించే డానికి చర్యలు తీసుకోనవలసినదిగా సదరు కంపెనీ టాంకర్ వర్కర్ల యూనియన్ కోరానని, కనుక వారి శ్రేయస్సు కోసం ఈ డిపోను కొనసాగించవలసినదిగా ఈ రోజు డిల్లీలో కేంద్ర పెట్రోలియం మరియు నాచురల్ గాస్ సెక్రటరీ, పంకజ్ జైన్‌ని కలసి మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి సదరు డిపోను కొనసాగించేదానికి తప్పక కృషి చేస్తానని తెలియజేశారు.

## కొత్తపట్నంలో పర్యటించిన దామచర్ల





**మత్స్యకారులను పరామర్శించి భోజన ఏర్పాట్లు**

**ఒంగోలులో దాదాపు మూడు వేల మందికి భోజన, తాగునీరు ఏర్పాటు**

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ తుపాను కారణంగా కొత్త పట్నం మండలంలోని పల్లెపాలెం, మడనూరు, ఈతముక్కల గ్రామాలలో మంగళవారం పర్యటించారు. మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి వారికి దాదాపు 1500 మందికి భోజన, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే ఒంగోలు 50వ డివిజన్‌లో వెంకటేశ్వర కాలనీ, నేతాజీకాలనీ, నెహ్రూనగర్, 2వ డివిజన్ కేశవ రాజుకుంట వద్ద, 3వ డివిజన్ ఎన్టీఆర్ కాలనీ వద్ద, 4వ డివిజను లో గల కరుణాకాలనీ, 9వ డివిజన్‌లో ఎఫ్‌సిఐ ఎదురు, 9వ డివిజన్ లో డ్రీమ్స్ స్కూల్ ఎదురు దాదాపు 3000 మందికి భోజనాలు, తాగు నీరు ఏర్పాటు చేశారు.



## పాకలలో మత్స్యకార కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మేజర్‌న్యూస్: సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో మత్స్యకార కుటుంబాలను కొండెపి ఎమ్మెల్యే డాక్టర్ డోల బాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. ఈ తుఫాను వలన వారికి జరిగిన నష్టాన్ని, వారికి కావలసిన నిత్యవసరాలు, పునరావస కేంద్రాలు గురించి తెలుసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.



## తుపాను నేపథ్యంలో సమన్వయంతో పోలీసులు

**ఎస్పీ మలికగర్గ్ ఆదేశాలతో ముమ్మరంగా రక్షణ చర్యలు**



ఒంగోలు, మేజర్‌న్యూస్: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో జిల్లా ఎస్పీ మలిక గర్గ్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు వారి పరిధిలోని రెవెన్యూ, ఆరోగ్యం, మునిసిపల్, పంచాయితీ, విద్యుత్ ఇతరశాఖ స్థానిక అధికారులతో సమన్వయంతో అవసరమైన అన్ని నివారణ, రక్షణ చర్యలను తీసుకున్నారు. తీర ప్రాంతాలలో, తుపాను తీవ్రత ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని, ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఈదురు గాలులకు రోడ్లపై విరిగిన చెట్లను వెంటనే తొలగించడం, ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణాలకు అంతరాయం కలగకుండా చేయడం, ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వాగులు వంకలు నిండిన గ్రామాలలో సహాయక చర్యలను జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టారు.